


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 149 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల మంగళవారం 3 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE 149 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA TUE 3 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది..


## వైసీపీపై చంద్రబాబు ఫైర్

- అధికారం కోల్పోయామనే అసహనంతో రెచ్చగొట్టేందుకు యత్నం
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్




ఆంధ్రప్రదేశ్ లో అలజడి సృష్టించాలని, హింసను ప్రేరేపించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. ఇందులో భాగంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దని టీడీపీ నేతలకు ఆయన సూచించారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ఆయన ఈ రోజు ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. అందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని, సంయమనం పాటించాలని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్ లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.వైసీపీ రెచ్చగొట్టే చర్యలకు దిగుతోందన్న చంద్రబాబు.. ఆ పార్టీ ఉచ్చులో పడి టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీనియర్ నేతలదేనని చెప్పారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైసీపీ పుట్టిందని, ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని అన్నారు.

ఈ సందర్భంగా తప్పుచేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీని రాష్ట్ర ప్రజలు ఛీదరించుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలో తాము చేసిన పాపాల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న టీడీపీ అజెండా సహజంగానే వైసీపీ నేతలకు నచ్చదని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.



నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

- మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో శిక్ష అమలు
- ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది ఉరిశిక్ష విధించిన కోర్టు
- శిక్షను అమలు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడి

- మిగతా 2లో





## ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

### కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్

- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా తీవ్ర విమర్శలు
- అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారని ఆరోపణ
- పలువురు మాజీ మంత్రులు, నేతల ఇళ్లపై దాడులు జరిగాయన్న రోజా
- ఇదేనా చంద్రబాబు చెప్పిన 'రూల్ ఆఫ్ లా' అని సూటి ప్రశ్న
- సాక్షి, డెక్కన్ క్రానికల్ కార్యాలయాలపైనా దాడులని వెల్లడి

తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, వారి ఆస్తులు, పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా దాడుల పరంపర కొనసాగుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న 'రూల్ ఆఫ్ లా' (చట్టబద్ధమైన పాలన) ఇదేనా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై జరిగిన దాడుల జాబితాను ఆమె వివరించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని, పేర్ని నాని, దాడిశెట్టి రాజా ఇళ్లతో పాటు, వల్లభనేని వంశీ, ముద్రగడ పద్మనాభం, భూమన కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతల నివాసాలపై దాడులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. హిందూపురం

- మిగతా 2లో



## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

- 90 ఏళ్ల వయస్సులో మెడిటేషన్ అనే ఆల్బమ్‌కు అవార్డు
- దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదన్న చైనా
- చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపణ

- మిగతా 2లో



# ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్.. బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు

- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ. 5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## లోక్‌సభలో రాహుల్ vs కేంద్రం..

### ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడిందనే మాట నేను చెప్పింది కాదు: రాహుల్ గాంధీ
- స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ నరవణే తన పుస్తకంలో రాశారని వెల్లడి
- ఈ పుస్తకం బయటకు వస్తే ప్రజలకు విషయం తెలుస్తుందని కేంద్రానికి భయం పట్టుకుందని వ్యాఖ్య
- దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్ సభలో లేవనెత్తేందుకు అనుమతించడం లేదని ఆరోపణ



లద్దాఖ్, డోక్లాం ప్రతిష్టంభన గురించి కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నలతో గందరగోళం నెలకొంది. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఓ మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఆయన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. రాహుల్ చెబుతున్న పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని.. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని

- మిగతా 2లో




## మాకు ప్రాణహాని ఉంది..

### భద్రత కోసం హైకోర్టును ఆశ్రయించిన జోగి రమేశ్

- ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయని పిటిషన్‌లో ఆరోపణ
- దాడి జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారని ఆయన కుమారుడి ఆవేదన
- తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని కోర్టుకు విన్నపం
- లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరపనున్న హైకోర్టు

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తన భద్రత విషయమై ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని తన నివాసంపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ, తనకు భద్రత కల్పించాలని


- మిగతా 2లో

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై కవిత కీలక వ్యాఖ్యలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే

- మిగతా 2లో





## వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

- అంబటి అరెస్ట్ తో ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు
- తిరుమల ప్రతిష్ఠ దిగజార్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న సజ్జల, బొత్స
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఏపీలో శాంతి భద్రతల వైఫ్యల్యానికి ఎవరు కారణం?

శాంతి భద్రతల వైఫల్యం ఏ ప్రభుత్వానికైనా చెడ్డపేరు తెస్తుంది. ఎన్ని మంచి పనులు చేసినా.. ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా శాంతిభద్రతల సమస్య మాత్రం ప్రజల్లోకి తొందరగా చొరబడుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలోనూ అదే జరిగింది. నాడు జగన్ ప్రభుత్వం టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంతో పాటు అనేక రకాలుగా లా అండ్ ఆర్డర్ సమస్య ఆ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడానికి కారణమయింది. ఇప్పుడు అదే సమస్య కూటమి ప్రభుత్వంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ఘర్షణలు, హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వానికి చెడ్డపేరును తెచ్చిపెడుతున్నాయి.

**శాంతి భద్రతలు...**

నియోజకవర్గాల స్థాయిలో శాంతి భద్రతలు అదుపు తప్పడంపై వాటి ప్రభావం రానున్న ఎన్నికల్లో పడే అవకాశముందన్న ఆందోళన సీనియర్ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందులో సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే ప్రజలకు తెలిసిపోతుంది. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ పోలీసుల తీరు కూడా ఆక్షేపణీయంగానే కనిపిస్తుంది. ఎవరి నుంచి వచ్చిన ఆదేశాలు మాత్రమే తెలియదు కానీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ల ఇళ్లపై దాడులు జరిగిన సమయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. ఇంత బీభత్సం జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరించడాన్ని బట్టి చూస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను...**

అసలు వివాదానికి కారణమైన ఫ్లెక్సీలను ముందుగానే పోలీసులు తొలగించి ఉంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు రాజకీయ పార్టీల మధ్య పోరు ఉన్న సమయంలో వివాదాస్పద ఫ్లెక్సీలను పెడితే ఖచ్చితంగా అక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని చెప్పాలి. ఆ మాత్రం కూడా తెలియకుండా పోలీసు శాఖ నిద్రమత్తులో జోగుతుండటాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. ఆరోజు ఫ్లెక్సీని తొలగించి ఉంటే ఇటు టీడీపీ, అటు వైసీపీ నేతల మధ్య ఘర్షణ తలెత్తి ఉండేది కాదని, అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెడితే జోగి రమేష్ ఇంటిపై దాడికి సాహసించి ఉండే వారు కాదన్నది కూడా అంతే వాస్తవమని న్యాయవాదులు కూడా చెబుతున్నారు. ఏపీలో జరుగుతున్న ఈ వివాదాలకు పోలీసుల వైఫల్యమే కారణమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

# వైసీపీ నేతలతో సజ్జల, బొత్స కీలక భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టించాయి. ఈ క్రమంలో రాంబాబుపై కేసు నమోదు కావడం... కోర్టు ఆయనకు రిమాండ్ విధించడం తెలిసిందే. తాజాగా, మరో మాజీ మంత్రి జోగి రమేష్ పై కూడా కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల వైసీపీ నేతలతో పార్టీ ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఈ రెండు ఉమ్మడి జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సమన్వయకర్తలు హాజరయ్యారు. ఇటీవల చోటు చేసుకుంటున్న అంశాలపై పార్టీ నేతలు ఎలా స్పందించాలనే అంశంపై సజ్జల, బొత్స సూచనలు చేశారు. తిరుమల ప్రతిష్ఠ దిగజార్చే విధంగా కూటమి వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా నేతలు అన్నారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను నిలువరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ నేతలకు భద్రత కల్పించేందుకు పోరాటం చేయాలని తెలిపారు.

# ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

- మొదటి పేజి తరువాయి

వైసీపీ కార్యాలయం, మార్గాని భరత్ కార్యాలయాలపై కూడా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, దేవినేని అవినాశ్, విడదల రజినిపై దాడికి యత్నించారని, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడి జరిగిందని వివరించారు. తనపై కూడా ఓ వ్యక్తిని ప్రయోగించి బూతులతో దాడి చేయిస్తున్నారని రోజా ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ దాడులు కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాలేదని, పత్రికా కార్యాలయాలపైనా జరిగాయని రోజా ఆరోపించారు. సాక్షి, డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థల ఆఫీసులపై జరిగిన దాడులను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని, చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని రోజా విమర్శించారు. ఈ దాడులన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

# చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారు: భూమన కరుణాకర్ రెడ్డి



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో సీబీఐ నివేదిక వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారమే మాట్లాడానని చంద్రబాబు అంటున్నారని భూమన ఎద్దేవా చేశారు. టీటీడీకి ఈ బోర్డును పరిచయం చేసిందే జగన్ అని చెప్పారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసే అవకాశమే లేదని సీబీఐ తెలిపిందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే బోలేబాబా డెయిరీ నుంచి టీటీడీ నెయ్యి కొనుగోలు చేసిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక బోలేబాబాను డిస్ క్వాలిఫై చేశామని అన్నారు.

తాను చేసిన వ్యాఖ్యలకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పినప్పటికీ దాడులు చేశారని భూమన మండిపడ్డారు. అంబటి ఇంటి మీదకు 3 వేల మంది రౌడీలను పంపించారని అన్నారు. జోగి రమేశ్ ఇంటిపై కూడా ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని విమర్శించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు జరిగాయని అన్నారు.

# లోక్‌సభలో రాహుల్ VS కేంద్రం..

## ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంపై వాగ్వాదం

- మొదటి పేజి తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు.దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..వార్తాపత్రికల క్లిప్పింగులు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై, ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్‌కు సూచించారు. మరోవైపు రాహుల్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో సభాకార్యకలాపాలకు అంతరాయం కలగడంతో లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# కాపుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: నిమ్మల రామానాయుడు



కాపుల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి ఏమాత్రం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాపుల భవిష్యత్తు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని రామానాయుడు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దివంగత తల్లిదండ్రులను ఉద్దేశించి అంబటి వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, అంత దారుణంగా మాట్లాడుతున్నా జగన్ ఎందుకు వారించలేదని ప్రశ్నించారు. ఇది జగన్ దర్శకత్వంలోనే జరుగుతున్న డ్రామా అని స్పష్టమవుతోందన్నారు.

**చరిత్రను గుర్తుంచుకోవాలి**

చరిత్రను గుర్తుచేస్తూ.. బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కాపు రిజర్వేషన్లను కాంగ్రెస్ ముఖ్యమంత్రులు నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి రద్దు చేస్తే, దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమే వాటిని పునరుద్ధరించారని రామానాయుడు తెలిపారు. చంద్రబాబు ఎంతో కష్టపడి కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే, అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ వాటిని రద్దు చేసి కాపులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కాపుల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగాను 'రౌడీ' అని, 'చంపితే తప్పేంటి' అని అన్న గౌతమ్ రెడ్డికి ఆరు నెలల్లోనే ఫైబర్ నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి జగన్ సత్కరించారని మండిపడ్డారు. రంగా హత్యలో నిందితులుగా ఉన్నవారు వైసీపీ ప్రెస్‌మీట్లలో పక్కన కూర్చుని నీతులు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాపుల కోసం పోరాడుతానన్న ముద్రగడ పద్మనాభం తన పేరు చివర 'రెడ్డి' అని తగిలించుకున్న తర్వాత కాపుల గురించి మాట్లాడటం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామన్నారు.

**బూతుల వల్లే వైసీపీ ఓటమి**

అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని వంటి నేతల బూతుల పురాణం కారణంగానే వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని, అధికారం కోల్పోయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. లోకేశ్ పై జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను మహిళాలోకం అసహ్యించుకుంటోందన్నారు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే దానికి కులాన్ని ఆపాదించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పల్నాడు వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమ (కాపు), బుద్ధా వెంకన్న (బీసీ)పై రాడ్లతో దాడి చేయించినప్పుడు జగన్‌కు వారి కులాలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

**చట్టం తనపని తాను చేసుకుపోతుంది**

గతంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసినప్పుడు అధికారంలో ఉన్న బొత్స సత్యనారాయణకు చట్టం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ శాంతిభద్రతలకే పెద్దపీట వేస్తారని, తప్పు ఎవరు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రామానాయుడు గుర్తుచేశారు. రంగాను అవమానించిన వారికి అండగా నిలుస్తున్న వైసీపీకి ఆయన పేరును ఉచ్ఛరించే హక్కు కూడా లేదని, అభివృద్ధిని పక్కనపెట్టి కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ నైజమని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

# పిలిస్తే సిట్ విచారణకు వెళ్లి సహకరిస్తా

- మొదటి పేజి తరువాయి

. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడిచిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మాకు ప్రాణహాని ఉంది..

- మొదటి పేజి తరువాయి

కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు.తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆధారాలుగా కోర్టుకు సమర్పిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ రెండు పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం కాసేపట్లో విచారణ జరపనుంది.

# నలుగురు మయన్మార్ మాఫియా సభ్యులను ఉరితీసిన చైనా

మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా నలుగురికి చైనాలో ఉరిశిక్ష అమలు చేశారు. ఈ మేరకు బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన నలుగురికి ఉరిశిక్ష అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గత ఏడాది కోర్టు ఈ శిక్ష విధించింది. తాజాగా దానిని అమలు చేసింది.

ఆన్‌లైన్ మోసాలతో పాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న ఈ గ్యాంగులపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన నేర ముఠాకు చెందిన సభ్యులకు మరణశిక్షను అమలు చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా పేర్కొంది.

వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, జూద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ మాఫియా, తమ వద్ద పనిచేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలను తీసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ముఠాలోని నలుగురికి శిక్షను అమలు చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ శిక్షను ఎప్పుడు అమలు చేశారనేది తెలియరాలేదు.

# దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది.దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు.

ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు.

తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

## పట్వా సభ్యులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచిత మెగా మెడికల్ క్యాంప్....

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 02.
పట్వా ఆధ్వర్యం లో కిమ్స్ శిఖర వారి సహకారం తో
పట్వా సభ్యులకు మరియు కుటుంబ సభ్యులకు పట్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి.4 న మెగా మెడికల్ క్యాంపు.
సభ్యులు అందరూ మీ కుటుంబసభ్యులకు కూడా ఈ అవకాశం ఉపయోగించుకోగలరు.వెన్యూ: అరండాల్ పేట 17/1 లో గల ఆతిధ్యం ఫంక్షన్ హాల్ నందు.
ఇట్లు,
పట్వా కార్యవర్గం.




# పెన్ పవర్
## సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా



## అంగన్వాడి కేంద్రాలకు బాపట్ల సేవా సేతు ద్వారా తల్లి ప్రేమను అనుసంధానించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 2:
బాపట్ల సేవా సేతు ద్వారా అంగన్వాడి కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల సేవా సేతు ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 1,552 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, పూర్తి సౌకర్యాలు కల్పించాలన్నారు. దాతలు అందించే విరాళాలను సద్వినియోగం చేసుకోవడానికి వేదిక ఏర్పాటు చేశామన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉండే ఆరేళ్లలో చిన్నారులకు తల్లి ప్రేమ అందించేలా ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఆయా కేంద్రాలలో ఏ అవసరాలు ఉన్నాయో, వాటన్నిటిని పరిష్కరించడానికి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. విరాళాల రూపంలో దాతలు ఇచ్చిన వస్తువులకు ధ్రువీకరణ పత్రాలు సమంత శాఖ అధికారులు ఇవ్వాల్సి ఉందన్నారు. కేంద్రాలకు అవసరమైనవన్నీ వెబ్ సైట్ లో పొందుపరచడానికి అంగన్వాడి సూపర్వైజర్లు, సిడిపివోలకు లాగిన్ లు ఇస్తామన్నారు. పూర్తి వివరాలను పొందుపరచాలన్నారు. పేదలకు బహుళ ప్రయోజనం కల్పించేలా రూపొందించిన వెబ్ సైట్ ను జయప్రదంగా ముందుకు తీసుకెళ్లడానికి సహకరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన పి4 స్ఫూర్తితో బాపట్ల సేవా సైతం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో మహిళ శిశు సంక్షేమ శాఖ పిడి రాధ మాధవి, ఐసిడిఎస్ సిడిపివోలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



## బాపట్లలో రాష్ట్ర చిరంజీవి యువత ప్రత్యేక పూజలు

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న విన్నకోట సురేష్

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 2:
బాపట్ల పట్టణంలోని శ్రీ సువర్చల సమిత శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన దంపతులకు కమల శిశువు జన్మించిన శుభ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర చిరంజీవి యువత జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్ నేతృత్వంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఆకు పూజ నిర్వహించి, గ్లోబల్ స్టార్మ్ రామ్ చరణ్ ఉపాసన దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, శ్రేయస్సు ప్రసాదించాలని స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు విష్ణుమూలకల చంద్రమోహన్, మాట్లాడుతూ చిరంజీవి కుటుంబానికి రాష్ట్ర ప్రజల అభిమానం, అభిమానుల ఆప్యాయత ఎల్లప్పుడూ అండగా ఆ కుటుంబానికి ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తపేట సీసీ రోడ్ & డ్రైన్ శంకుస్థాపన.. ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్....

పెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి.02,
కొత్తపేటలో ఎంతో కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న సీసీ రోడ్ మరియు డ్రైన్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలు, వర్షాకాలంలో డ్రైనేజ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ పనులకు శ్రీకారం చుట్టాం.మౌలిక సదుపాయాల అభివృద్ధే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. మంచి రోడ్లు, సక్రమమైన డ్రైనేజీ ఉంటేనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యం అవుతుంది. అందుకే ప్రతి కాలనీ, ప్రతి వీధి అభివృద్ధి చెందాలనే సంకల్పంతో పని చేస్తున్నాం.కొత్తపేట ప్రజలు చూపుతున్న సహకారం, నమ్మకమే నాకు బలంగా నిలుస్తోంది. ఈ పనులు నాణ్యతతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ప్రజల సౌకర్యమే మా రాజకీయ లక్ష్యం.భవిష్యత్తులో కూడా కొత్తపేట అభివృద్ధికి అవసరమైన అన్ని పనులు దశలవారీగా చేపడతామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి పరిష్కారం తప్పకుండా చేస్తాం.ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూడకొత్తపేట అభివృద్ధి బాటలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నాను

## కాంగ్రెస్ పార్టీని బలోపేతం చెయ్యాలి.

### -...వై.యస్ షర్మిల రెడ్డి...

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 02.
అఖిలభారత కాంగ్రెస్ పార్టీ మరియు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతో యువ రక్తాన్ని ప్రోత్సహించే విధంగా గుంటూరు జిల్లా లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చెయ్యాలి అనేటటువంటి ఆలోచనతో గుంటూరు జిల్లా అధ్యక్షులు గా యన్నం సుధీర్ బాబు ని మరియు గుంటూరు నగర అధ్యక్షులు గా ఖలీల్ కి అవకాశం కల్పించి బాధ్యతలు అప్పజెప్పిన శుభ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిల రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలియజేయడంతో వై.యస్ షర్మిల రెడ్డి ,గుంటూరు జిల్లా మరియు నగర అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు షేక్.కరీం కాంగ్రెస్ పార్టీ జిల్లా మరియు నగర అధ్యక్షులతో పాటు వై.యస్ షర్మిల రెడ్డి ని కలిసినటువంటి సందర్భం..



## పేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఘన సన్మానం

### -పాల్గొన్న టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 02:
చిలకలూరిపేట : స్థానిక ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన యద్దనపూడి వేణుబాబు ని తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైన కార్మిక పరిషత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వక కలిసిన నాయకులు ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు డిపో మేనేజర్‌తో మాట్లాడిన ఆయన, కార్మికుల సమస్యలు మరియు డిపో అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు మరియు అధికారుల మధ్య సమన్వయం ఉంటేనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. వీరితోపాటు కార్మిక పరిషత్ డిపో కార్యదర్శి అద్దంకి వరప్రసాదరావు అధ్యక్షులు,పావులూరు వెంకటేశ్వరరావు - టీఎన్టీయూసీ నియోజకవర్గ కార్యదర్శి, సుబ్బారావు సహాయ కార్యదర్శి, సైదా అహ్మద్ కోశాధికారి,నక్క శ్రీనివాసరావు, ఎన్టీఆర్ రమేష్ బాబు, ఆర్.ఎన్. రావు , రాములు నాయక్, గణపవరం సురేష్ బాబు, వెలగాల పోతురాజు , నూతన మేనేజర్ వేణుబాబు తమను కలవడానికి వచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, డిపో ప్రగతికి అందరి సహకారం కోరారు




## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్:

### సమస్యలు విన్నవించుకున్నా 62 మంది అర్జీదారులు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 2:
చట్టపరిధిలో త్వరితగతిన విచారించి అర్జీదారులు సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 62 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకొని రాతపూర్వక అర్జీలను అందజేశారు.జిల్లా ఎస్పీ అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని, వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ అర్జీని పోలీస్ శాఖ చట్టపరిధిలో పరిష్కరించడం సాధ్యంకాని పక్షంలో, ఆ సమస్య పరిష్కారానికి సంప్రదించవలసిన అధికారుల వివరాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. అర్జీలు పదేపదే పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వృద్ధులు, మహిళలను పదేపదే పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలకు పిలిపించవద్దని సూచించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సంబంధిత విభాగానికి పంపాలని అధికారులకు స్పష్టం చేశారు.కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు తదితర పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి 62 అర్జీలు అందజేయబడ్డాయి.ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ మహిళా ఎస్ఐ లక్ష్మీరాజ్యం, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# కోర్టుల్లో వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి...

బపెన్ పవర్, గగుంటూరు, ఫిబ్రవరి: 02,లైంగిక నేరాల బాధితులు, పిల్లలు, బెదిరింపుల మధ్య ఉన్న సాక్షులు మళ్లీ మానసిక వేదనకు గురికాకుండా, వారి వాంగ్మూలాలను సురక్షితమైన, భద్రమైన, పిల్లల అనుకూల వాతావరణంలో నమోదు చేసేందుకు అన్ని కోర్టుల్లో వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా నియమించిన వల్నరబుల్ విట్నెస్ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ గీతా మిట్టల్ స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు నియమించిన వల్నరబుల్ విట్నెస్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వల్నరబుల్ విట్నెస్ సెంటర్ల కమిటీ సహకారంతో ఆదివారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో న్యాయాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ గీతా మిట్టల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలు, వికలాంగులు, దుర్వినియోగానికి గురైన బాధితులు వంటి వల్నరబుల్ సాక్షులకు అనుకూలమైన కోర్టు వాతావరణాన్ని కల్పించడమే కమిటీ లక్ష్యమని చెప్పారు. స్క్రీన్లు, అనువాదకులు, విరామాలు, సహాయక వ్యక్తులు వంటి ప్రత్యేక చర్యలను వినియోగించి, నిందితుడి హక్కులకు భంగం కలగకుండా న్యాయమైన వాంగ్మూలం అందేలా చూడాలని పేర్కొన్నారు.

సాక్షులు నిందితులను ఎదుర్కోకుండా ప్రత్యేకంగా వేచి ఉండే గదులు, వీడియో కాన్ఫరెన్స్ గదులు, సహాయక వ్యక్తుల వినియోగం, నిందితులతో ముఖాముఖి కలవకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రధాన కోర్టు ప్రాంతానికి దూరంగా, పిల్లలకు అనుకూలంగా బొమ్మలు, ఆటవస్తువులు, పుస్తకాలు ఉండే విధంగా అన్ని వయస్సుల వారికి తగిన ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సాక్షుల భద్రత కోసం ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండాలని అన్నారు.

వాంగ్మూలం సమయంలో తల్లిదండ్రులు, సంరక్షకులు లేదా కౌన్సిలర్ వంటి నియమిత సహాయక వ్యక్తి సాక్షితో పాటు ఉండవచ్చని చెప్పారు. సాక్షుల పేరు, చిరునామా, పాఠశాల లేదా గుర్తింపు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టకుండా కఠినంగా నిషేధించాలని ఆమె స్పష్టం చేశారు.

న్యాయమూర్తులు, కౌన్సిలర్లు సహా సిబ్బంది అంతా పిల్లలు, లైంగిక దాడి బాధితులు వంటి వల్నరబుల్ వ్యక్తులతో వ్యవహరించే తీరుపట్ల తగిన శిక్షణ పొందాలని ఆమె తెలిపారు. దర్యాప్తు లేదా తీర్పు సమయంలో సరళమైన, అర్థమయ్యే భాషను ఉపయోగించాలని, అవసరమైతే అనువాదకులు, సంకేత భాష నిపుణులు, ప్రత్యేక ఉపాధ్యాయులను వినియోగించాలని సూచించారు. ప్రశ్నలు అర్థం చేసుకునే సామర్థ్యంపై దృష్టి పెట్టి, మానసిక వేదనను తగ్గిస్తూ, నిరంతర సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. సాక్షుల హక్కులు, నిందితుడికి న్యాయమైన విచారణ హక్కు మధ్య సమతుల్యత ఉండాలని ఆమె నొక్కి చెప్పారు.

ప్రతి ఒక్కరికీ సమానత్వం, న్యాయానికి చేరువ కల్పించాలనే చట్ట బద్ధతను పాటించాలని న్యాయాధికారులను ఆమె కోరారు. వల్నరబుల్ సాక్షులు సివిల్ లేదా క్రిమినల్ కేసుల్లో, కుటుంబ వివాదాల్లో, కస్టడీ వివాదాల్లో, లైంగిక దుర్వినియోగ బాధితులుగా, పితృత్వ కేసుల్లో, జువెనైల్ జస్టిస్ బోర్డుల ముందు, చిల్డ్రన్స్ కోర్టుల్లో హాజరవుతారని ఆమె తెలిపారు.

వి డబల్యు డీసీ ల వినియోగం క్రిమినల్ కేసులకే కాకుండా సివిల్ కేసులు, కుటుంబ కోర్టులు, జువెనైల్ జస్టిస్ బోర్డులు, చిల్డ్రన్స్ కోర్టుల వంటి ఇతర న్యాయ విభాగాలకు కూడా అనుమతించాలన్నారు. అన్ని న్యాయ విభాగాల్లో వల్నరబుల్ సాక్షుల వాంగ్మూలాల రికార్డింగ్‌కు అనుమతి ఇవ్వాలని ఆమె సూచించారు.

పిల్లలు పలు ఇంటర్వ్యూలు ఎదుర్కోవడం, ట్రయల్‌కు ముందు దీర్ఘకాలం వేచిచూడటం, కోర్టు ఆలస్యాలు, నిందితుడిని ఎదుర్కోవడం, క్లిష్టమైన న్యాయ భాషలో ప్రశ్నలు, అవసరం లేని ప్రశ్నలు, నిజాయితీగా ఇచ్చిన సమాధానాలను నమ్మశక్యం కానివిగా చూపించడం వంటి కారణాల వల్ల పూర్తి స్థాయిలో తమ వాంగ్మూలాన్ని ఇవ్వలేకపోతున్నారని ఆమె అన్నారు.

అనుచిత ప్రశ్నలు, న్యాయవాదుల అడ్డంకులు, పెద్దలు ఎలా సమాధానం చెప్పాలనే సూచనలు, సాక్షులను ఇబ్బంది పెట్టేలా రూపొందించిన క్రాస్ ఎగ్జామినేషన్, అనుమతికి సంబంధించిన పరిమితులు, కథనాలను మార్చుకోవాల్సిన పరిస్థితులు, మానసిక వేదన వల్ల ప్రక్రియ ఆలస్యం కావడం వంటి సమస్యలను ఆమె వివరించారు. నేరస్తుడిని ఎదుర్కోవడం, హింసాత్మక అనుభవాలను మళ్లీ చెప్పుకోవడం, దూషణాత్మక క్రాస్ ఎగ్జామినేషన్ వల్ల ద్వితీయ మానసిక గాయాలు కలుగుతున్నాయని చెప్పారు.



దర్యాప్తు నుంచి తీర్పు వరకు వివిధ దశలలో పాటించాల్సిన మార్గదర్శకాలను అనేక న్యాయ తీర్పులు నిర్దేశించాయని, వాటిని పోలీసులు, వైద్యులు, మేజిస్ట్రేట్లు తప్పనిసరిగా పాటించాలని ఆమె తెలిపారు. ఈ మార్గదర్శకాలు ఐక్యరాజ్యసమితి మార్గదర్శకాలు, అంతర్జాతీయ పత్రాలు, భారతదేశంలోని చట్టాలు, అలాగే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, యూకే, యూఎస్ఎ, ఫిలిప్పీన్స్ వంటి దేశాల న్యాయ తీర్పుల ఆధారంగా రూపొందించబడ్డాయని ఆమె చెప్పారు.

ఈ అన్ని అడ్డంకులను అధిగమించేందుకే వల్నరబుల్ విట్నెస్ కోర్ట్‌రూమ్‌లను ఆలోచించి అమలు చేస్తున్నామని జస్టిస్ గీతా మిట్టల్ తెలిపారు. కోర్టుకు ముందు సందర్శన, కోర్టు హాజరు, వాంగ్మూలం, క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో న్యాయ మూర్తులు నాయకత్వం చూపుతూ సాక్షులతో నేరుగా మమేకం కావాలని, గౌరవంతో వ్యవహరించాలని, ప్రశ్నలు న్యాయంగా, వయస్సుకు తగినట్లుగా ఉండాలని, సాక్షుల గౌరవం, ఆత్మగౌరవం మొత్తం ప్రక్రియలో కాపాడాలని ఆమె సూచించారు.

గుంటూరు విచ్చేసిన జస్టిస్ గీత మిట్టల్ కు జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వల్నరబుల్ విట్నెస్ డిపోజిషన్ సెంటర్ల కమిటీ అధ్యక్షులు జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్, న్యాయ మూర్తులు జస్టిస్ ఆర్. రఘునందన రావు, జస్టిస్ వి. సుజాత, జస్టిస్ ఎస్. సమత, జస్టిస్ వి. గోపాల కృష్ణ, జస్టిస్ కిరణ్మయి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. కళ్యాణచక్రవర్తి, ఇతర జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయ అధికారులు, పోలీస్ అధికారులు సరిత, తదితరులు పాల్గొన్నారు

# అనుభవం లేని పాలనతో ఐదేళ్లు వెనుకబాటు

**-సీఎం చంద్రబాబు సమర్థతతో అభివృద్ధి గాడిలో రాష్ట్రం-ఐదేళ్ల రాక్షసి పాలన... అస్తవ్యస్తం...**

**-ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు దిశగా ప్రభుత్వం-దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ చార్జీలు తగ్గింపు**

**-వైసీపీ పాలనలో విద్యుత్ ఉత్పత్తి లేదు అంతా కొనుగోలు-రూ. 17 కోట్ల 37 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు**

**-యనమలలో సబ్ స్టేషన్ ను ప్రారంభం-7.40 కోట్ల ఆర్ అండ్ బి రోడ్లకు శంకుస్థాపన**

**-95 మందికి 51,48,729 సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత-రూ. 4 కోట్ల స్త్రీ నిధి చెక్కులు అందజేత**

**-పలు సిసి రోడ్లు ప్రారంభోత్సవం -మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి**





పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 2:
పాలనపై అవగాహన, అనుభవం లేని వ్యక్తికి అధికారాన్ని అప్పగించడం వల్ల గత ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోకపోగా, పదేళ్ల పాలనలో వెనుకబాటుకు గురైందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆ పరిస్థితిని ప్రత్యక్షంగా అనుభవించిన ప్రజలే అపార అనుభవం, సమర్థత కలిగిన చంద్రబాబు నాయుడుకు మళ్లీ ముఖ్యమంత్రి పదవి అప్పగించారని తెలిపారు.

సోమవారం పర్చూరు నియోజకవర్గంలోని యద్దనపూడి, మార్టూరు మండలాల్లో నిర్వహించిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.

**దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ చార్జీల తగ్గింపు**

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూడ
తాను మంత్రి అయిన అనంతరం తొలిసారిగా యనమదల విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశామని, ఆ తరువాతే రాష్ట్రవ్యాప్తంగా 200కుపైగా ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ట్రూ–అప్ చార్జీల పేరిట సామాన్యులపై విద్యుత్ భారం మోపారని, ఆ భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించిందన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ చార్జీలను తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మరో రూ.1.19 పైసలు తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

**పెన్షన్లు, ఫీజు బకాయిలు, రైతులకు భరోసా**

ఒకే సంతకంతో పెన్షన్లు పెంచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల కాలేజీ ఫీజు బకాయిలు పెట్టగా, కూటమి ప్రభుత్వం ఒకేసారి రూ.10 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు.

దేశంలో తొలిసారిగా బార్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, దీనికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషే కారణమని తెలిపారు. ఈ క్రమంలో బార్లీ రైతులకు రూ.270 కోట్లు విడుదల చేశామని చెప్పారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**యద్దనపూడి అభివృద్ధే లక్ష్యం ఎమ్మెల్యే ఏలూరి**

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూడ
ఐదేళ్ల రాక్షస పాలన అనంతరం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందన్నారు. గత ప్రభుత్వంలో అరాచకాలు, భౌతిక దాడులు తప్ప అభివృద్ధి లేదని,



తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా అభివృద్ధి, సంక్షేమాన్ని వేగవంతం చేసిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని స్పష్టం చేశారు.

యద్దనపూడి మండలంలో సాగునీరు, తాగునీరు, రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, అన్ని గ్రామాలకు ఇంటింటి కుళాయి ద్వారా నీటి సరఫరా లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. నీటి వసతి కల్పిస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

**లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం**

యద్దనపూడి, పూనూరు ఉపకేంద్రాలపై అధిక లోడ్ కారణంగా లో వోల్టేజ్ సమస్య ఏర్పడుతుండటంతో యనమదలలో కొత్త ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఉపకేంద్ర నిర్మాణానికి స్థలం కేటాయించిన డాక్టర్ లింగా శ్రీనివాసరావు, కేవీ రెడ్డిలను అభినందించారు. యద్దనపూడిలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**రూ.17.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పర్చూరు నియోజకవర్గంలో రూ.17 కోట్ల 37 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

రూ.1.40 కోట్ల వ్యయంతో యనమదల నుంచి బల్లికురవపోలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.85 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.

యనమదలలో రూ.4.65 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. దర్శి నుంచి వలపర్ల సమీపంలోని ఎంఎస్ఎంఈ సేజ్ వరకు రూ.6 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

**రూ.4 కోట్ల స్త్రీ నిధి రుణాలు,95 మందికి చెక్కులు...**

స్త్రీ నిధి పథకం కింద రూ.4 కోట్ల రుణాలు మంజూరు మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సిఫారసు మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం 95 మందికి రూ.51,48,729 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. డీఆర్‌డీఏ సహకారంతో ఆరుగురు లబ్ధిదారులకు ఒక్కో లబ్ధిదారునికి రూ.70 వేల సబ్సిడీతో 6 ఎగ్ కార్ట్స్ పంపిణీ చేశారు.

# బాపట్లలో రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ

**-: భారీగా నిల్వల వ్యత్యాసం డీలర్‌పై కేసు నమోదు:**

**-నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**- సివిల్ సప్లై అధికారి ఫణి కుమార్ హెచ్చరిక**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 2: బాపట్ల పట్టణంలో పౌర సరఫరాల శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని షాపు నంబర్ 0789014 తటవర్తి భానురేఖ, లక్ష్మీ నారాయణ షాపును తనిఖీ చేయగా, భారీ స్థాయిలో బియ్యం నిల్వల వ్యత్యాసం బయటపడింది. తనిఖీ సమయంలో రికార్డుల ప్రకారం ఉండవలసిన బియ్యం నిల్వ 3,710 కేజీలు కాగా, భౌతికంగా 5,445 కేజీల నిల్వ ఉన్నట్లు బాపట్ల సివిల్ సప్లై అధికారి ఫణి కుమార్ గుర్తించారు. అంటే సుమారు 1,735 కేజీల (17.35 క్వింటాళ్లు) బియ్యం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ అక్రమ నిల్వలపై జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేయడమే కాకుండా, సదరు డీలర్‌పై క్రమశిక్షణా చర్యల నిమిత్తం బాపట్ల ఆర్డీఓ కు నివేదిక సమర్పించారు.



# పీ4 స్ఫూర్తితో 'బాపట్ల సేవా సేతు' ప్రారంభం :కలెక్టర్



పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఫిబ్రవరి 2:
జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల లోపాలను తొలగించేందుకు బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పీ4 స్ఫూర్తితో దాతలను, వసతి గృహాలను అనుసంధానించే లక్ష్యంతో రూపొందించిన 'బాపట్ల సేవా సేతు' (ఝుజూఫ్శ్రీఝ.జూ91.ఏశీఎ) పోర్టల్‌కు మంచి స్పందన లభిస్తోంది. కలెక్టర్ పిలుపునకు స్పందించిన చీరాలకు చెందిన కృతి ఫౌండేషన్ సోమవారం జిల్లాలోని రెండు విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు చేయూతనందించింది. చీరాల మండలం ఈపురుపాలెం పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల కోసం 16 కుర్చీలను అందజేయగా, పర్చూరు మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర వసతి గృహంలో విద్యార్థుల కోసం 47 బకెట్లు, మగ్గులను పంపిణీ చేశారు. వసతి గృహాల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్వని బృందాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కృతి ఫౌండేషన్ ప్రతినిధులు ఉడత చంద్రశేఖర్, టి. ఝాన్సీ కళ, మలిపెద్ది వీరబాబు, వాలంటీర్ బొమ్మిరెడ్డి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# నాదెండ్లలో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు

## చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు చేతుల మీదగా ప్రారంభం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 02:
నాదెండ్ల: గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగే ఒంగోలు జాతి వృషభ రాజముల బండ లాగుడు బల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా సోమవారం 2 పళ్ళు విభాగానికి పోటీ జరుగుతుంది. ఈరోజు ముఖ్య అతిథిగా చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు చేతులమీదగా ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాదెండ్ల పి ఏ సీ యస్ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నాదెండ్ల యస్ ఐ వెంకటేశ్వరరావు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనటం జరిగింది. ఈ విభాగంలో మొత్తం 10 జతలు ఎడ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే : ప్రత్తిపాటి

**సూర్యచంద్రులు గతి తప్పరన్నది ఎంత నిజమో.. చంద్రబాబు తప్పు చేయరన్నది అంతే నిజం**

**అధికార పొగరుతో నాడు జగన్ టీడీపీపై మోపిన నేరాభియోగాలు.. తప్పుడుకేసులు నేడు విచారణ సంస్థల సమగ్ర దర్యాప్తుతో పటాపంచలు అవుతున్నాయి**

**కల్తీ నెయ్యి కేసు తనకు, తన పార్టీకి భారీ డిఫెక్ట్ అవుతుందనే జగన్... అంబటి, జోగిలను చంద్రబాబు, లోకేశ్ లపైకి ఉసిగొల్పాడు. మాజీమంత్రి ప్రత్తిపాటి**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 02:
చిలకలూరిపేట : పక్కా పథకం, ప్రణాళికతో తన విద్వేష రాజకీయాల్లో భాగంగా, అధికారంలో ఉన్నానన్న పొగరుతో నాడు జగన్... టీడీపీ అధినేత చంద్రబాబు సహా, నాతోపాటు పార్టీ ప్రధాన నాయకులపై మోపిన అభియోగాలు, తప్పుడు కేసులు నిలబడవని నాడే చెప్పాం. కాలగమనంలో జగన్ కపట రాజకీయాలు దూదిపింజల్లా తేలిపోతాయని అప్పుడే ప్రజలకు తెలియచేశాం. టీడీపీ నిర్మూలనే లక్ష్యంగా, వైకాపా ప్రభుత్వం నిరాటకంగా ఐదేళ్లపాటు సాగించిన కక్షసాధింపులు, కుట్రలు నేడు విచారణ సంస్థల సమగ్రదర్యాప్తులో పటాపంచలవుతున్నాయి. స్కిల్ కేసు విచారణలో భాగంగా నాడు సిట్ చంద్రబాబు పాత్రకు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని తప్పుపట్టిన వైసీపీనేతలు.. నేడు ఈడీ క్లీన్ చిట్ కు ఏం వక్రభాష్యాలు చెబుతారు? చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే అన్నది జగమెరిగిన సత్యం, సూర్యచంద్రులు గతితప్పరు అన్నది ఎంత నిజమో.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పు చేయరు అన్నది అంతే నిజం. ఈ వాస్తవం గ్రహించకుండా నాడు అధికార మదంతో జగన్ తన అవినీతి మకిలను చంద్రబాబుకు ఆపాదించే ప్రయత్నం చేసి, కొరివితో తల గోక్కున్నాడు.

**కల్తీనెయ్యి కేసు ఎఫెక్ట్.. తనకు డిఫెక్ట్ కాకూడదనే జగన్.. అంబటి, జోగిలను ఉసిగొల్పాడు**

కుట్ర కుతంత్రాలు, విద్వేష విధ్వంసాలే కేంద్రంగా, రాష్ట్ర వినాశనమే లక్ష్యంగా జగన్ సాగిస్తున్న క్రిమినల్ పాలిటిక్స్ ను ప్రజలు ఎప్పటికీ విశ్వసించరని మరోసారి రుజువైంది. కూటమి ప్రభుత్వ సుస్థిరపాలన, సమగ్రాభివృద్ధికి అడ్డుకట్ట వేయడం పెట్టుబడులు ఆకర్షణలో రాకెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న చంద్రబాబును నిలువరించడం జగన్ తరం కాదు. కల్తీనెయ్యి వ్యవహారం ఎఫెక్ట్ ..తనకు, తన పార్టీకి భారీ డిఫెక్ట్ కాకూడదనే తన మురికి రాజకీయాల్లో భాగంగానే జగన్.. ఉన్నపళంగా మాజీమంత్రులు అంబటి, జోగిలను చంద్రబాబు, లోకేశ్ లపైకి ఉసిగొల్పాడు. ఈ వాస్తవం ప్రజలు గ్రహించారు కనుకే టీడీపీశ్రేణుల ఆగ్రహానికి జతకలిసి, వైసీపీ శ్రేణుల కవ్వింపు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టారు.

**బడ్జెట్లో చంద్రబాబు సంకల్ప సాకారానికి మోదీ తనవంతు సహకారం అందించారు..**

విజన్ -2047 లక్ష్యసాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు, ఆవిష్కరణలకు కార్యరూపమిచ్చేలా తాజా



బడ్జెట్ లో ఏపీకి కేటాయింపులు జరిగాయి. హైస్పీడ్ రైల్ కారిడార్లు, తయారీ రంగాలకు ప్రోత్సాహకాలు, ఎం.ఎస్.ఎం.ఈల బలోపేతానికి సహకారం వంటి నిర్ణయాలతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చారు. బడ్జెట్లో దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన మోదీ దూరదృష్టి.. చంద్రబాబు భవిష్యత్ సంకల్పాన్ని తప్పకుండా సాకారం చేస్తుంది." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

# భట్టిప్రోలులో నిర్వహించిన ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సమావేశం

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి,2,
మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం చైర్ పర్సన్ దావులూరి వెంకట లలిత కుమారి అధ్యక్షతన భట్టిప్రోలు పీహెచ్సీ లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దావూరి వెంకట లలిత కుమారి,భట్టిప్రోలు సర్పంచ్ ధార



రవికిరణ్మయి, సూరేపల్లి సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి,జెడ్పిటిసి తిరువీధుల ఉదయ భాస్కరి,ఎంపీడీవో ఎస్ వెంకటరమణ,మండల తహసిల్దారు ఎం శ్రీనివాసరావు, వైద్యురాలు మొహాసిన తాజ్,పిహెచ్సి సీనియర్ అసిస్టెంట్ బి శ్రీనివాసరావు జమ ఖర్చులు తెలియజేసి ఆసుపత్రి లో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ని పలు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమాలో సి హెచ్ ఓ మంగరాజు మరియు పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

# కోటి పదిహేను లక్షలు 6 గ్రూపులకు అందించిన స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్.

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి,2,
డ్వాక్రా గ్రూప్ మహిళలు రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ లేని రుణాలను పొందాలని స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వి వి.జగదీష్ కుమార్ అన్నారు. భట్టిప్రోలు స్టేట్ బ్యాంక్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డ్వాక్రా మహిళల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగదీష్ కుమార్ ఆరు గ్రూపులకు చెందిన మహిళలకు కోటి 15 లక్షల రూపాయలను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు బ్రాంచ్ మేనేజర్ ధన సింగ్ నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జగదీష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్వాక్రా మహిళలకు రూ 10 లక్షల వరకు తీసుకున్న రుణాలు వడ్డీ రాయితీని అందిస్తున్నందున వాటి ని సద్విని చేసుకుంటూ ఆర్థికంగా నిలబడేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వం ఇచ్చిన



సబ్సిడీలను పొందాలన్నారు. ఒక్కో గ్రూపునకు రూ 20 లక్షల వరకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని కాదు పది లక్షలు చాలు అనుకుంటే అవసర మైనప్పుడు రూ 30 లక్షలు పొందలేకపోవచ్చు నన్నారు. రుణాలను సద్విని తీసుకొని ఆదాయాలను పెంచుకునే విధంగా చూడాలన్నారు. స్టేట్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ధరణి గ్రూపుకు రూ 20 లక్షలు,గాంధీ గ్రూపుకు రూ 20 లక్షలు, అరవింద గ్రూపు కు 20 లక్షలు,వైష్ణవి గ్రూపుకు 15 లక్షలు, బిస్మిల్లా గ్రూపు కు 20 లక్షలు,శ్రీ సాయిరామ గ్రూపుకు రూ 20 లక్షల చెక్కులను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ సీసీలు బ్యాంక్ సిబ్బంది,డ్వాక్రా మహిళలు,డ్వాక్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట అభివృద్ధి ప్రదాత ప్రత్తిపాటి బాటలో పట్టణ పార్టీ నాయకత్వం

## -శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సమాద్ ఖాన్,రవి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 02:
చిలకలూరిపేట: మాజీ మంత్రి,శాసనసభ్యులు, అభివృద్ధి ప్రదాత ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మండల మరియు టౌన్ స్థాయి కమిటీల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ సమాద్ ఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధుమాల రవి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు , అమరావతి ఉద్యమ నేత ఫరూక్




నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై వీరు కీలక అవగాహన పొందారు. ఈ సందర్భంగా సమాద్ ఖాన్, రవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు, నిబద్ధతకు మారుపేరని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలను ఉన్నత స్థానాల్లోకి తీసుకురావడమే పార్టీ లక్ష్యమని, అన్ని కులాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ఏకైక పార్టీ టీడీపీ అని స్పష్టం చేశారు.


# ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభమైన ఆధార్ మార్పులు

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి,2:
మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 2,3,4 వ తేదీలలో పోస్టల్ శాఖ వారి సహకారంతో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయడమైనదని సబ్ పోస్ట్ మాస్టర్ ఆర్ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు క్యాంపు నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆధార్ కార్డు నందు మార్పులు చేర్పులు చేయబడతాయ న్నారు. ప్రాసెసింగ్ ఫీజు రూ 75లు లేదా రూ 125 లు చెల్లించ వలసి ఉంటుందన్నారు. మార్పు చేయవలసిన వారు రుజువులతో పై క్యాంపు నాకు విచ్చేసి అక్కడ అధికారులతో సంప్రదించాలని సబ్ పోస్ట్ మాస్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భారతదేశంలో అత్యధిక సభ్యులు గల ఏకైక పార్టీ భారతీయ జనతాపార్టీ..చెరుకూరి తిరుపతిరావు..

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 02.
భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ సమక్షంలో తూర్పు నియోజకవర్గం పాత గుంటూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీలో జిల్లా ఉపాధ్యక్షులుగా హోంగార్డ్స్ హెల్పర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా వివిధ బాధ్యతలు నిర్వర్తించిన రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి వారి అనుచరులతో బిజెపిలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు అదేవిధంగా నల్లపాడుకు చెందిన హబీబున్నీసా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. ఈసందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని తద్వారా ఎక్కువ మంది పార్టీకి ఆకర్షితులయ్యే విధంగా పనిచేసి వారిని పార్టీలో చేరే విధంగా కృషిచేసి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.
బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ భారతదేశంలో అత్యధిక సభ్యులు గల ఏకైక పార్టీ భారతీయ జనతాపార్టీ అని ఈ పార్టీలో ఒకసారి కండువా కప్పుకొని పార్టీలో చేరితే వారి ఒళ్లంతా పులకరించి పోతుందని దేశం కోసం ధర్మం కోసం మన వంతు ఏదైనా చేయాలని కార్యకర్తలకు అనిపిస్తుందని ఒకసారి పార్టీలో చేరితే జీవితాంతం ఈ పార్టీలోనే కొనసాగాలి అనిపిస్తుందని ముఖ్యంగా భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఎన్నో ఆకర్షణీయమైన పథకాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు అందుతున్నాయని, మాజీ భారత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కన్న కలలను మోడీ గారి ద్వారా ఫలితాలు వస్తున్నాయని ఇటువంటి పార్టీలో మీరంతా చేరటం ఎంతో గర్వకారణం అని వారు అన్నారు. లినూతనంగా చేరిన రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి మాట్లాడుతూ. బిజెపి ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పరిపాలనకు ఆకర్షితులై నేను పార్టీలో చేరానన్నారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో అంకితభావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.
ఈకార్యక్రమంలో జాతీయ స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ కెవి సుబ్బారావు రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ భజరంగ్ రామకృష్ణ తోట శ్రీనివాసరావు మాజీ కార్పొరేటర్ శ్రావణకుమారి
ఉపాధ్యక్షులు విమలాదేవి కార్యదర్శులు నారాయణరెడ్డి శివయ్య కుందూరు నాగేశ్వరరావు పలువురు మోర్చా అధ్యక్షులు మండల అధ్యక్షులు, మరియు రావూరు చంద్రశేఖర్ రావూరు సుబ్రహ్మణ్యం బడే సుబ్బారెడ్డి దీక్షితులు జొన్నాభట్ల మురళీకృష్ణ వీరవల్లి మాల్యాద్రి జనసేన జిల్లా సెక్రటరీ పుల్లాభట్ల ఫణి కుమార్ శర్మ దాసరి శ్రీనివాసరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# వైసీపీ నేతల బూతులకు కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ జగన్ రెడ్డే

**- కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి సహించలేక కుట్రలు- వైసీపీ నేతల వ్యాఖ్యలు చూసి సభ్యసమాజం చీదరించుకుంటోంది**

**- కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన జోగి రమేష్.. బీసీ కార్డు వాడుకోవడం సిగ్గుచేటు - పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కిన పేర్ని నాని కూడా నీతులు మాట్లాడుతున్నాడు**

**- చంద్రబాబు, లోకేశ్ గురించి తేడాగా మాట్లాడిన ఏ ఒక్కర్నీ వదిలేది లేదన్న మంత్రి కొల్లు**

**రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అశాంతి రగల్చేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.**



మచిలీపట్నం (పెన్ పవర్) జనవరి 02:
మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.
ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.
పలు సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ భ్రష్టుపట్టిపోయింది.
ఇష్టానుసారంగా మాట్లాడి ప్రజల్ని రెచ్చగొట్టి కులం, మతం ప్రాంతం పేరుతో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.
ఐదేళ్ల అరాచకం తర్వాత ప్రజలు ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నారు. పెట్టుబడులు వస్తున్నాయి. ఉద్యోగ ఉపాధి అవకాశాలతో యువత ఆనందంగా ఉన్నారు.
అందుకే రాష్ట్రంలో అలజడులు సృష్టించడం కోసం దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్ రెడ్డి.. సిగ్గు లేకుండా నారా లోకేశ్ గారి గురించి తప్పుడు కూతలు కూస్తున్నాడు.
మరోవైపు అంబటి రాంబాబు ఆంబోతులా రోడ్డుపై పడి విర్రవీగుతున్నాడు. వంగవీటి రంగా లాంటి మహనీయులతో పోల్చుకుంటూ రాష్ట్రంలో కులాల మధ్య అల్లర్లకు ప్లాన్ చేస్తున్నారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసిన పేర్ని నాని కూడా నీతులు వల్లిస్తున్నాడు. బియ్యం బొక్కేసి డబ్బు కట్టేస్తే నీతి మంతుడిని అయిపోయాను అనేలా వ్యవహరిస్తున్నాడు.
కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన జోగి రమేష్ తాను బీసీనని మాట్లాడ్డానికి సిగ్గుపడాలి. ఐదేళ్లు బీసీలపై దాడులు జరిగినపుడు, పీకలు కోసినపుడు ఎక్కడున్నాడని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యలు, నోటి దురుసు చూసి వీళ్లేం నాయకులని ప్రజలు చీదరించుకుంటున్నారు.
గతంలో అధికారంలో ఉండి బూతులు మాట్లాడారు. ఇప్పుడు బూతులు మాట్లాడి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు.
మేము పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాం కాబట్టి సరిపోయింది. తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణ. నిబద్ధత. అందుకే వైసీపీ నాయకులు ఎన్ని రకాలుగా రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా.. టీడీపీ నాయకులు ఎంతో సంయమనంతో ఉన్నారు. మా కార్యకర్తలలో ఆవేశం కట్టలు తెంచుకుంటే.. పరిస్థితిని ఊహించడం కూడా



కష్టమనే విషయం వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలి.
బూతులు మాట్లాడినోళ్లకు పదవులివ్వాలి అనే నీచ సంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్ రెడ్డే. చంద్రబాబును తిట్టినోళ్లకు పదవులిచ్చాడు. చంద్రబాబు గారి ఇంటిపై దాడి చేసినోళ్లకు పదవులిచ్చాడు. పార్టీ కార్యాలయంపై దాడి చేసినోళ్లను హీరోలుగా కీర్తించాడు.
దాడి చేస్తేనే పదవులిస్తామని, బూతులు తిడితేనే గౌరవిస్తారని వైసీపీ నుండి బయటకొచ్చిన నేతలు స్వయంగా చెబుతున్నారంటే వైసీపీలో ఎలాంటి నీచ సంస్కృతి నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు.
రాష్ట్రం ప్రశాంతంగా ఉండడం జగన్ రెడ్డికి ఇష్టం లేదు. అభివృద్ధి చూసి జగన్ రెడ్డి కుళ్లుకుంటున్నాడు.
చంద్రబాబు కృషితో రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులు వస్తుంటే చూడలేకపోతున్నారు. కులం, మతం ప్రాంతాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనుకుంటున్నారు.
గత ఐదేళ్లు అమరావతి, పోలవరం నిర్వీర్యం చేయాలనుకున్నాడు. తిరుమల దేవస్థానం ప్రసాదాన్ని కూడా కల్తీ చేసిన నీచుడు జగన్ రెడ్డి. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిలో అసలు నెయ్యే లేదని చీబీఐ నివేదిక బయటపెట్టింది. పామాయిల్, జంతువుల కొవ్వు కలిపి నెయ్యి పేరుతో సరఫరా చేశారని తేల్చారు. నెయ్యి కల్తీ గురించి వైసీపీ నేతలు మాట్లాడే ముందు.. నిబంధనలు ఎందుకు మార్చారో ముందు సమాధానం చెప్పాలి. తమ అనుయాయులకు కాంట్రాక్టులు కట్టబెట్టి జేబులు నింపుకోవడం కోసం నెయ్యి లేని నెయ్యి సరఫరా చేశారు. చుక్క పాలు సేకరించని డెయిరీలకు డెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టారు. ఇప్పుడు నిజాలు బయటకొస్తుండడంతో.. అరాచకాలకు పూనుకుంటున్నారు. జగన్ రెడ్డి పాలనలో చేసిన అరాచకాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తుండడంతో.. రోజుకో రచ్చ చేస్తున్నాడు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకుంటాం. అరాచకాలు సృష్టిస్తాం. కులాలు మతాలమధ్య చిచ్చు పెడతామని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదు. తప్పు చేసిన ప్రతి ఒక్కరిపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# మానవ తప్పిదాలతో జరిగే రహదారి ప్రమాదాలను నివారించాలి - జిల్లా కలెక్టర్

మచిలీపట్నం (పెన్ పవర్) ఫిబ్రవరి 02:
మానవ తప్పిదాలతో జరిగే రహదారి ప్రమాదాలను నివారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడుతో కలిసి రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, జాతీయ, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్లకు తీసుకున్న చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ కేసులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రమాదాలకు అవకాశం లేకుండా తక్షణం స్పందించి పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారులపై విద్యుత్ దీపాలు పనిచేయకపోవడం పట్ల కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ సమస్యపై ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదని, ఈసారి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెలుగుతున్నవి, వెలగని విద్యుత్ దీపాల వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు.
విజయవాడమచిలీపట్నం జాతీయ రహదారిపై ఉన్న కాలినడక వంతెనలకు (ఫుట్ ఓవర్ బ్రిడ్జెస్) రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను కడుతున్నారని, దీనివల్ల అవి నేరాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారుతాయని, వాటి తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారులపై ప్రమాదం సంభవించినప్పుడు ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు పనిచేయకపోతే కనుక, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో చేరుస్తామని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామాల నుంచి జాతీయ రహదారులకు కలిసే ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అటువంటి ప్రాంతాలను గుర్తించి అప్రోచ్ రహదారులకు స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.2025 డిసెంబర్ నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 52 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, వాటిలో 32 మరణాలు, 31 మంది



గాయాలపాలయ్యారని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.సమావేశంలో జిల్లా రవాణా అధికారి ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాస్, భారత జాతీయ రహదారుల అధికార సంస్థ పిడి విద్యాసాగర్, జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వర్లు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేశ్వరరావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ కుముదిని సింగ్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, రాష్ట్ర రహదారులు, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పెట్రేగిపోతున్న నకిలీ విలేకరి వైశాలి గ్యాంగ్ ఆగడాలు....

బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 02.
రోజు రోజుకు తీవ్రమవుతున్న లేడీ డాన్ వైశాలి వ్యవహార శైలి.
చిరు వ్యాపారులను సైతం తమకు కప్పం చెల్లించాలని బెదిరింపులకు పాల్పడుతున్న లేడీ డాన్ నకిలీ విలేకరి వైశాలి.రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ప్రత్యేక గ్యాంగ్ లను పెంచి పోషిస్తూ నకిలీ ఐడీ కార్డులు ఇచ్చి చిన్నపాటి వ్యాపారస్తులను బెదిరించి నగదు వసూళ్లు చేయాలని తన గ్యాంగ్ కు ఆదేశాలు.



రాజధాని అమరావతి నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక టీమ్ ను తన వెంట తీసుకుని నగదు ఇవ్వాలని వ్యాపారులకు లేని పక్షంలో మీ వ్యాపారాలపై యూట్యూబ్ చానెల్స్ లో అసత్యాలు ప్రచారం చేస్తామని బెదిరింపులు.వైశాలి గ్యాంగ్ కు నగదు ఇవ్వకపోతే తన గ్యాంగ్ తో కలసి దాడులకు తెగబడుతున్న వైనం.ఇప్పటికే పలు జిల్లాల్లో వైశాలి గ్యాంగ్ పై కేసులు నమోదు.
కొద్ది రోజుల క్రితం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో సైతం వైశాలి గ్యాంగ్ పై కేసు నమోదు అయినా మార్పు చెందని వైశాలి గ్యాంగ్..రెండు రోజుల క్రితం నగదు ఇవ్వనందుకు తాడేపల్లిలో రేషన్ డీలర్ పై దాడికి పాల్పడిన వైశాలి గ్యాంగ్ పై 118(1)351(2)308(2)319)(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.నిజమైన విలేకర్లకు తలనొప్పిగా మారిన నకిలీ విలేకరి, లేడీ డాన్ వైశాలి వ్యవహారం.
నకిలీ విలేకరి వైశాలి గ్యాంగ్ పై త్వరలో ఆధారాలతో డీజీపీకి ఫిర్యాదు చేయనున్నబాధితులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు..

# త్రాగునీటి సరఫరా చేసే హెడ్ వాటర్ వర్క్స్ లో సిబ్బంది, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి..,





బపెన్ పవర్, గుంటూరు, ఫిబ్రవరి, 02.
నీటి సరఫరాకి ముందే క్లోరిన్ తగు మోతాదులో ఉండేలా చూడాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం జిఎంసి హెడ్ వాటర్ వర్క్స్, మానస సరోవరం, నందివెలుగు రోడ్ ఆర్ఓబి, నార్ల ఆడిటోరియం, అన్నమయ్య చెరువు వాకింగ్ ట్రాక్ లను విభాగాధిపతులతో కలిసి పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ తొలుత హెడ్ వాటర్ వర్క్స్ కి ఉండవల్లి నుండి వస్తున్న నీటి శాతం, ట్రీట్మెంట్, ల్యాబ్, ఆలం, క్లోరిన్ కలపడం, సిబ్బంది, పంపింగ్ పాయింట్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ త్రాగునీటి సరఫరాలో అతి కీలకమైన హెడ్ వాటర్ వర్క్స్ లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. త్రాగునీటి సరఫరాకి అవసరమైన మోటార్లు మరమత్తుకు గురై, నెలలు గడిచినా చేయకపోవడం తెలుసుకొని, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం మోటార్లను మరమత్తు చేయించాలని ఎస్ఈని ఆదేశించారు. ల్యాబ్, ఫిల్టరేషన్ బెడ్స్ ని పరిశీలించి, నిర్దేశిత టైం ప్రకారం శ్యాంపిల్స్ పరిశీలించి, రికార్డ్ బుక్ లో నమోదు చేయాలన్నారు. మానస సరోవరం పార్క్, నార్ల ఆడిటోరియంలను పరిశీలించి, వాటి అభివృద్ధికి ఇప్పటి వరకు ఉన్న ప్రతిపాదనలను అందించాలని సిటి ప్లానర్, ఎస్ఈలను ఆదేశించారు. అన్నమయ్య చెరువు వాకింగ్ ట్రాక్ లో పెండింగ్ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్దం చేయలని ఈఈని, నందివెలుగు రోడ్ లోని ఆర్ఓబి సర్వీస్ రోడ్ల వెంబడి విద్యుత్ స్తంభాలు డ్రైన్ వైపుగా ఏర్పాటు చేయడానికి సర్వే చేయాలనీ సిటి ప్లానర్ ని ఆదేశించారు. నార్ల ఆడిటోరియం పరిసరాల్లో చెత్త కుప్పలు గమనించి, వ్యర్దాలు వేసేవారిని గుర్తించి, అపరాధ రుసుం విధించాలని, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.
పర్యటనలో కార్పొరేటర్ మానం పద్మశ్రీ, సిపి రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి:

## -ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 02: ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీసీ వెల్ఫేర్ శాసనసభ కమిటీ సభ్యులు, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన ఆయన అక్కడి చిరు వ్యాపారులతో ముచ్చటించి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వ్యాపారులు స్థానిక ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి వారని పేర్కొన్నారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ మరియు ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా రాయితీపై అందిస్తున్న ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను విస్తరించుకోవాలని సూచించారు. వ్యాపారం బలపడితే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు. చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మార్కెట్‌లో మౌలిక వసతులు మెరుగుపర్చడం, వ్యాపారులకు అనుకూల వాతావరణం కల్పించడం కోసం అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని ఆయన వ్యాపారులకు పిలుపునిచ్చారు.



# రుణ భారతం : ప్రతీ ఒక్కరి తల మీద లక్షన్నర అప్పులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏ బడ్జెట్ చూసినా ఏమున్నది గర్వకారణం. చిట్టా పద్దులు సమస్తం అప్పుల వ్యవహారం అని పాడుకోవాల్సిందే. బడ్జెట్ అన్నది చిత్రంగా ఉంటుంది. రాబడి తక్కువగా ఉంటుంది. అయినా సరే భారీ నంబర్ తో బడ్జెట్ తయారు అవుతుంది. మరి ఇంత సొమ్ము ఎలా వస్తుంది అంటే రకరకాలైన అంచనాలు అందులో తెచ్చి పెడతారు. అయినా సరే అంతరం భారీగా ఉంటుంది. మరి ఆ లోటుని ఎలా పూడుస్తారు అంటే అప్పులు తెచ్చి అన్నది సింపుల్ ఆన్సర్. ఇపుడు కేంద్ర బడ్జెట్ లో చూస్తే అదే పరిస్థితిగా ఉంది. ఏకంగా 17.2 లక్షల కోట్ల అప్పులు 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం చేయబోతోంది. బడ్జెట్ ని 53 లక్షల కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టిన తరువాత వచ్చే రాబడులు ఆదాయాలు అన్నీ సరి చూసుకుంటే అప్పులు చేయక తప్పని పరిస్థితి అన్న మాట.

**మోడీ హయాంలో పెరిగింది :**

అప్పులు గత ప్రధానుల హయంలో అంతా కలసి చేసిన అప్పుల కంటే రెట్టింపుగా మోడీ ప్రభుత్వ హయాంలో గత పన్నెండేళ్ళ కాలంలోనే అప్పులు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. దీంతో ఈ దేశంలో ప్రతీ పౌరుడి నెత్తి మీద అప్పు ఉంది. చేతిలో చిల్లి గవ్వ లేదని ఎవరూ చింతించ నక్కరలేదు, ఎందుకంటే అప్పు వారి తలకాయ మీద లక్షల్లోనే ఉంది. ఇంకా అది పెరగబోతోంది కూడా.

**అప్పులు ఎలా తెస్తారు :**

తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తీసుకుంటే 17.2 లక్షల కోట్ల లోటు ఉంది కదా మరి వీటికి ఏ విధంగా అప్పులు తెస్తారు అంటే దానికి ఒక మార్గం ఉంది అంటున్నారు. డేటెడ్ సెక్యూరిటీలు అలాగే ఇతర మార్గాల ద్వారా ఈ అప్పులను సేకరించి తీసుకుని రావాలని కేంద్రం ఆలోచిస్తోందని అంటున్నారు. వచ్చే ఆదాయం అలాగే పెట్టే ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తుంది దాంతో భారీగానే ద్రవ్య లోటు ఉంది దానికి పూడ్చుకునే మార్గాలని కేంద్రం అన్వేషిస్తోంది. ఈ క్రమంలో 11. 7 లక్షల కోట్ల రూపాయలు డేటెడ్ సెక్యూరిటీల ద్వారా సేకరిస్తారని అంటున్నారు. అలాగే చిన్న మొత్తాల పొదుపు, ఇతర రుణాల ద్వారా మిగిలిన ఆరు లక్షల కోట్లను సేకరిస్తారు అని అంటున్నారు.

**నెలకు లక్ష కోట్ల వడ్డీ :**

అప్పులు చేయడం ఎవరికైనా బాగానే ఉంటుంది. కానీ అసలు కంటే ముందు వడ్డీ పట్టి పీడిస్తుంది. ఈ క్రమంలో గత వడ్డీల చెల్లింపు పెను భారంగా మారబోతోంది. నెలకు లక్ష కోట్ల పైనే కేంద్ర ప్రభుత్వం వడ్డీలు కట్టాల్సి వస్తోంది అని అంటున్నారు. ఈ వడ్డీలు అసలు అన్నీ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థ మీద అతి పెద్ద గుది బండగా మారుతున్నాయని అంటున్నారు. ఇక కొత్త ఆర్థిక సంవత్సరంలో వడ్డీలకు కేంద్రం చెల్లించాల్సిన మొత్తం ఎంత అంటే అక్షరాలా 14,03,972 రూపాయలు అని అంటున్నారు. దానిని కనుక నెలకు విభజిస్తే 1.17 లక్షల కోట్ల రూపాయలుగా ఉందని చెబుతున్నారు

**అప్పుల లెక్క ఇదీ :**

ఇక మోడీ ప్రధానిగా 2014లో అయ్యారు. ఆయన కంటే ముందు అంటే గత ఆరున్నర దశాబ్దాల కాలంలో ఎందరో ప్రధానులు ఈ దేశాన్ని ఏలారు వారంతా కలసి చేసిన అప్పులు చూస్తే అక్షరాలా 55,87,147 కోట్ల రూపాయలుగా ఉంది. అంటే సగటున ఏడాదికి 83 వేల కోట్ల అప్పు అన్న మాట. ఇక మోడీ ప్రధాని అయ్యాక చేసిన అప్పు తీసుకుంటే 1,52,85,363 కోట్ల రూపాయలుగా ఉంది. అంటే సగటున నెలకే 1.10 లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు అన్న మాట. ఇంతలా అప్పులు చేస్తూ రుణ భారతాన్ని రచిస్తున్న తీరు మాత్రం ప్రతీ భారతీయ పౌరుడినీ ఆలోచింపచేస్తోంది అన్నది మాత్రం నిజం.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గల్లా మాధవి @ చంద్రబాబుపై స్కై రేంజ్ అభిమానం...!

**హైదరాబాద్ పెన్ పవర్:** గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగా తొలిసారి విజయం దక్కించుకున్న గల్లా మాధవి.. తాజాగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుపై తనకు ఉన్న అనంత అభిమానం చాటుకున్నారు. పార్టీ తరఫున ఏ చిన్న వచ్చినా.. ఎలాంటి సమస్య ఎదరైనా నేనున్నానంటూ.. కొందరు నాయకులు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలకు సరైన కౌంటర్లు ఇవ్వాలని.. ఆ పార్టీ లేవనెత్తుతున్న అంశాలపై ధీటుగా స్పందించాలని సీఎం చంద్రబాబు పదే పదే చెబుతున్నారు.అయితే.. కొందరు నాయకులు వింటున్నారు. మరికొందరు నాయకులు తెరమీదికి ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే గల్లా మాధవి ఓ మహిళా ఎమ్మెల్యేగా రెచ్చిపోయారు. చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. పెద్ద ఎత్తున ఉద్యమించారు. తెలుగు మహిళల విభాగం కార్యకర్తలను వెంటబెట్టుకుని అంబటి రాంబాబు కార్యాలయాన్ని ముట్టడించారు. అంతేకాదు.. అంబటికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఒక్క గల్లా మాధవే కాదు.. ఆమె భర్త రామచంద్రరావు కూడా.. ఈ నిరసనలో తన వంతు పాత్ర పోషించారు. అంబటి కార్యాలయాన్ని చుట్టుముట్టారు. బేషరతుగా అంబటి సీఎం చంద్రబాబుకు.. క్షమాపణలు చెప్పాల్సిందేనని తేల్చి చెప్పారు. అంతేకాదు.. కార్యకర్తలను కూడా మాధవి ముందుండి నడిపించారు. కష్టకాలంలో టీడీపీ ఎలా స్పందిస్తుంది ? కార్యకర్తలు ఎలా రియాక్ట్ అవుతారు ? అనే విషయాలను ఆమె స్పష్టం చేశారు. దీంతో గుంటూరులో పెద్ద ఎత్తున టీడీపీ ఏకతాటిపైకి వచ్చింది.ఈ పరిణామాలు.. రాష్ట్ర వ్యాప్తంగా కూడా దావాలనంలా వ్యాపించాయి. పెద్ద ఎత్తున చంద్రబాబుకు మద్దతుగా కార్యకర్తలు రోడ్డెక్కారు. గతంలో కూడా చంద్రబాబుపై కేసునమోదై.. ఆయన జైలుకు వెళ్లినప్పుడు.. హుటాహుటిన ఇంత పెద్ద స్పందన రాకపోవడం గమనార్హం. రెండు రోజుల తర్వాత కానీ.. పార్టీ కార్యకర్తలు స్పందించలేకపోయారు. కానీ, తాజాగా మాత్రం ఎమ్మెల్యే గల్లా మాధవి చొరవ తీసుకుని అడుగులు వేయడం.. పార్టీ కార్యకర్తలతో కలిసి ఉద్యమించడం ద్వారా.. పార్టీ విషయంలో ఆమెకు ఉన్న నిబద్ధత, బాబుపై ఉన్న అభిమానాన్ని చాటిందని అంటున్నారు పరిశీలకులు.

## ఆర్థిక మంత్రి చీరపై చర్చ : విధానం ముఖ్యం... వస్త్రధారణ కాదు!

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో 'కేంద్ర బడ్జెట్' అనేది కేవలం అంకెల గజబిజి కాదు.. అది కోట్లాది మంది సామాన్యుల ఆశల ప్రతిబింబం.. దేశ ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచి. అయితే దురదృష్టవశాత్తూ గత కొన్నేళ్లుగా బడ్జెట్ రోజున చర్చలు ఆర్థిక లోటు లేదా ద్రవ్యోల్బణం చుట్టూ కాకుండా ఆర్థిక మంత్రి ధరించిన 'చీర' చుట్టూ తిరగడం మన రాజకీయ పరిణతిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటీవల నిర్మలా సీతారామన్ వ్యక్తం చేసిన అసహనం కేవలం ఒక వ్యక్తిగత స్పందన కాదు.. అది మన సమాజంలోని లింగ వివక్షతపై సంధించిన అస్త్రం.

**లింగ వివక్షతకు అద్దం పడుతున్న వస్త్రధారణ చర్చ**

నిర్మలా సీతారామన్ అడిగిన ప్రశ్న సూటిగా ఉంది. "బడ్జెట్‌ను ప్రవేశపెట్టేది పురుష మంత్రి అయితే ఆయన వేసుకున్న సూటు లేదా కుర్తా గురించి చర్చించేవారా?" ఈ ఒక్క మాట మన విశ్లేషణల్లో ఉన్న ద్వంద్వ ప్రమాణాలను ఎండగట్టింది. పురుష నాయకుల విషయంలో వారి నిర్ణయాలు, విధానాలు విశ్లేషణకు గురవుతాయి. కానీ ఒక మహిళా నాయకురాలు అత్యున్నత పదవిలో ఉన్నా ఆమె నైపుణ్యం కంటే ఆమె వేషధారణే వార్తల్లోకి రావడం మీడియా, సమాజం యొక్క పితృస్వామ్య దృక్పథానికి నిదర్శనం.

**సంకేతాల వెతుకులాట.. ఒక వ్యసనం**

ఆమె కట్టుకున్న కాంచీపురం చీరకు రాజకీయ రంగు పులమడం, దానిని ఎన్నికల వ్యూహంగా అభివర్ణించడం విశ్లేషకుల అతివాదానికి పరాకాష్ట. ప్రతి ఏటా ఆమె దేశీ నేత కార్మికులను ప్రోత్సహించేలా చేనేత వస్త్రాలను ధరించడం అభినందనీయం. అయితే దానిని ఒక 'ఫ్యాషన్ స్టేట్‌మెంట్'గా మార్చి బడ్జెట్‌లోని కీలక కేటాయింపులను పక్కన పెట్టడం ప్రజాస్వామ్యానికి చేటు. అధికారం ఉన్న మహిళను "ప్రతినిధి"గా చూడకుండా ఒక "ప్రదర్శన వస్తువు"గా పరిగణించే ధోరణి మారాలి.

**చర్చ మారాలి.. దృష్టి కోణం మారాలి**

బడ్జెట్ అంటే సామాన్యుడి పళ్లెంలో ఆహారం, మధ్యతరగతిపై పన్నుల భారం, యువతకు ఉపాధి అవకాశాలు. వీటిపై జరగాల్సిన మేధోమథనం, చీర రంగు లేదా డిజైన్ వంటి అనవసర అంశాల వైపు మళ్లుతోంది. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, వ్యవసాయ రంగం సంక్షోభం, పారిశ్రామిక వృద్ధి వంటి అంశాలపై పట్టు సాధించాల్సిన చోట గంటల తరబడి వస్త్రాల గురించి చర్చించడం బాధ్యతారాహిత్యం. మహిళా నాయకులను వారి పనితీరు, మేధస్సు , వారు తీసుకునే నిర్ణయాల ప్రాతిపదికన అంచనా వేసినప్పుడే నిజమైన లింగ సమానత్వం సాధ్యమవుతుంది.ఁనిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను ఒక హెచ్చరికగా భావించాలి. బడ్జెట్ అనేది దేశ ఆర్థిక ఆరోగ్యాన్ని నిర్ణయించే పత్రమే తప్ప ఫ్యాషన్ షో కాదు. మహిళా మంత్రుల వస్త్రాల మీద చూపే శ్రద్ధను, వారు ప్రవేశపెట్టే విధానాల మీద చూపిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. వస్త్రధారణపై చర్చలు ఆపి.. విధానాలపై విశ్లేషణలు మొదలైనప్పుడే మన రాజకీయ సంస్కృతి గౌరవప్రదంగా మారుతుంది.

# టేబుల్ వద్దకు వస్తే స్క్రీన్ మారేలా వాటే ఐడియా బాస్

**హైదరాబాద్ పెన్ పవర్:** స్మార్ట్ ఫోన్ల రాకతో జీవనశైలి ఎంతలా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో బోర్ కొడుతోందని.. ఎవరితోనైనా మాట్లాడేందుకు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ఆ అవకాశమే లేదు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. గేమ్స్ మొదలుకొని.. సోషల్ మీడియా వరకు.. వాట్సాప్ నుంచి ఓటీటీలో సినిమాల వరకు నాన్ స్టాప్ గా ఎన్ని గంటలైనా తమకు తాము ఎంగేజ్ అయిపోవటం కామన్ గా మారింది. ఆ అలవాటు కాస్తా వర్కు ప్లేస్ లోనూ కంటిన్యూ అవుతున్న పరిస్థితి.తమ అభిరుచులకు తగినట్లుగా పని మధ్యలో బ్రేకులు తీసుకోవటం.. తమకు నేచ్చిన గేమ్ కానీ ఓటీటీలో సిరీస్ కానీ సోషల్ మీడియాలో కబుర్లు కానీ.. వీడియోలు చూసుకుంటూ పనిని వాయిదా వేసే తీరు అంతకంతకూ ఎక్కువైంది. అదే సమయంలో బాస్ కంట పడి తిట్లు తినే ఉద్యోగుల సంఖ్య తక్కువేం కాదు. అయితే.. ఇలాంటి పరిస్థితిని తప్పించుకోవటానికి బెంగళూరుకు చెందిన ఒక టెకీకి వచ్చిన ఐడియా గురించి తెలిసిన వారంతా ఫిదా అవుతున్నారు. ఇంతకూ అతనికి ఆ ఐడియా రావటానికి కారణం.. తనకు నచ్చిన గేమ్ ఆడుతూ బాస్ కంట పడి తిట్టించుకోవటమే.ఇలా తిట్లు తినే పరిస్థితి రిపీట్ కాకుండా ఉండేందుకు అదిరే ఐడియాతో ఒక డివైజ్ ను తయారు చేశాడు. అదేమంటే.. తన కంప్యూటర్ కు ఏఐ పవర్డ్ కెమెరా డివైజ్ ను అమర్చాడు. ఆ కెమెరా పంకజ్ కూర్చున్న టేబుల్ పరిధిలో ఎవరు వచ్చినా గుర్తించటం.. ఆ వెంటనే కంప్యూటర్ స్క్రీన్ ఇన్ స్టంట్ గా కోడ్ ఎడిటర్ గా మారిపోతుంది. ఏఐ, ఆటోమేషన్, రియల్ టైమ్ ఫేస్ డిటెక్షన్ టెక్నాలజీతో ఈ హార్డ్ వేర్ ను రూపొందించాడు.తనకు వచ్చిన ఐడియాను ఎక్స్ లో పోస్టు చేశాడు. దీనికి లక్షలాది వ్యూస్ రావటమే కాదు.. వాటే ఐడియా బాస్ అంటూ మెచ్చుకుంటున్నారు. తన బాస్ తిట్ల దండకం నుంచి తప్పించుకోవటానికి ఈ హార్డ్ వేర్ డివైజ్ తయారు చేసినా.. ఆఫీసుల్లో ప్రైవసీని కాపాడేందుకు ఇదో స్మార్ట్ సొల్యూషన్ గా ఉపయోగపడుతుందని పంకజ్ చెబుతున్నాడు. ఏమైనా బుర్ర ఉన్నోడి ఆలోచనలు ఎలా ఉంటాయనటానికి ఇదో నిదర్శనంగా చెప్పొచ్చు.

# ఎఫైర్ పై నిలదీసిన మామ.. కోడలు ఎంత పనిచేసిందంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్నిసాక్షిగా వివాహం చేసుకుని పెద్దల సమక్షంలో దాంపత్య బంధంలోకి అడుగుపెట్టి పిల్లలను కని కుటుంబాన్ని కొనసాగించడమే వివాహ వ్యవస్థ యొక్క అసలు లక్ష్యం. కష్టసుఖాల్లో భార్యాభర్తలు ఒకరికి ఒకరు తోడుగా నిలవాల్సిన ఈ పవిత్ర బంధం నేటి సమాజంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. భార్యాభర్తల మధ్య సరైన అవగాహన, పరస్పర గౌరవం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా మారుతోంది.ఈ లోటే వివాహేతర సంబంధాలకు దారితీస్తోంది. మొదట రహస్యంగా మొదలయ్యే ఈ అనైతిక బంధాలు, చివరకు కుటుంబాలను కూల్చివేసే స్థాయికి చేరుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇవి దారుణమైన నేరాలకు, ప్రాణనష్టం జరిగే పరిస్థితులకు కూడా కారణమవుతున్నాయి. ఇటువంటి ఘటనలు ఇటీవల దేశవ్యాప్తంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.అటువంటి షాకింగ్ ఘటన ఒకటి తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. అక్కడ నివసిస్తున్న ఓ మహిళ, తన భర్తకు తెలియకుండా మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం క్రమంగా ఆమె మామకు తెలిసింది. దీంతో ఆయన కోడలిని నిలదీసి ఇది సరికాదని ఇలాంటి వ్యవహారాల వల్ల కుటుంబ పరువు మంటగలిసిపోతుందని హెచ్చరించారు.కానీ తన అక్రమ సంబంధానికి మామ అడ్డుగా మారడంతో ఆ కోడలు తీవ్ర అసహనానికి గురైంది. ఈ విషయాన్ని తన ప్రియుడితో చర్చించిన ఆమె, చివరకు మామను చంపేయాలనే ఘోర నిర్ణయానికి వచ్చింది. ఇందుకు ప్రియుడి సహకారం తీసుకుంది.ప్లాన్ ప్రకారం మామ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో అతనిపై పెట్రోల్ పోసి, వెంటనే నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి అతని శరీరం మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో అతడికి సుమారు 70 శాతం తీవ్ర కాలిన గాయాలు అయ్యాయి. మంటల తాకిడిని తట్టుకోలేక అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. బైక్ నడపలేని స్థితిలో కొంత దూరం కాలిన శరీరంతోనే నడుచుకుంటూ రావడం అక్కడున్నవారిని భయాందోళనలకు గురిచేసింది.ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వీడియోలను చూసినవారికి ఒళ్లు గగుర్పొడిచే పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న తమిళనాడు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో బాధితుడి కోడలు, ఆమె ప్రియుడు సహా మరో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసినట్లు తమిళనాడు మీడియా వెల్లడిస్తోంది.

వివాహేతర సంబంధాలు ఎలా ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, సమాజాన్నే వణికించే నేరాలకు దారి తీస్తాయో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోంది. చిన్న తప్పు అనుకున్న నిర్ణయం, చివరకు ప్రాణాల మీదికి తెచ్చే ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందన్నదానికి ఇది మరో ఉదాహరణగా నిలుస్తోంది.

# ముద్రగడ లేఖకు బుద్ధా కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో లేఖాస్త్రాలు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముద్రగడ పద్మనాభరెడ్డి లేఖ సంధిస్తే ఆయనకు కౌంటర్ గా టీడీపీ నుంచి బుద్ధా వెంకన్న మరో లేఖ వదిలారు. దీంతో ఈ రెండు లేఖలలోని అంశాలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తున్నాయి. ముద్రగడ పద్మనాభరెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ కి లేఖాస్త్రం సంధించారు. గోదావరి భాషలో యాసలో ఆయన రాసిన లేఖలో కాపుల గురించి ప్రస్తావించారు. ఏపీలో చంద్రబాబు జమానాలో కాపులను టార్గెట్ చేస్తున్నారు అని ముద్రగడ తీవ్ర ఆరోపణ చేశారు. చంద్రబాబు ఎపుడు సీఎం అయినా ఇదే వైఖరితో సాగుతున్నారు అని ఆయన విమర్శించారు. 2014 నుంచి 2019 మధ్యలో తనను తన కుటుంబాన్ని వేధించిన బాబు ఇపుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీద కూడా ఇదే తీరున వేధింపులు చేస్తున్నారు అని ముద్రగడ లేఖలో పేర్కొన్నారు.

**ఎందుకు ఆగ్రహం :**

కాపుల మీద ఎందుకు చంద్రబాబుకు ఆగ్రహం అని ముద్రగడ ప్రశ్నించారు. కాపులను బీసీలలొ చేరుస్తాను అని 2014లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బాబు దానిని నెరవేర్చలేదని దాంతో కాపులు అంతా ఆయన మీద ఆగ్రహంగా ఉన్నారని ముద్రగడ అన్నారు. అయితే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మీద ప్రేమతోనే వారు మరోసారి టీడీపీకి ఓటు వేసి గెలిపించారు అని చెప్పారు. మాజీ మంత్రులు అన్న గౌరవం లేకుండా జోగి రమేష్ విడదల రజనీ అంబటి రాంబాబు వంటి వారి మీద ఈ దాడులు ఏమిటి అని ఆయన ప్రశ్నించారు ఏపీలో రాక్షస పాలన సాగుతోందని ముద్రగడ ఆక్షేపించారు.

**అందరినీ జైలులోనే :**

కేంద్రంతో మాట్లాడి ఏపీలో ఎమర్జెన్సీ పాలన పెట్టించండని, అపుడు ప్రతిపక్ష నాయకులు అందరినీ జైలులో ఉంచేయవచ్చు అని ముద్రగడ సెటైరికల్ గా సలహా ఇచ్చారు. అబద్ధాలు చెప్పకూడదని మా నాన్న మాకు చెప్పేవారు అని ముద్రగడ గుర్తు చేసుకున్నారు ఒక అబద్ధానికి వంద అబద్దాలు చెప్పాల్సి వస్తుందని అన్నారు. అయితే తిరుపతి లడ్డూ విషయంలో చంద్రబాబు అబద్ధాలు చెప్పారని తీరా సీబీఐ ఇచ్చిన నివేదికలో అసలు విషయం బయటపడిందని అందుకే దానిని డైవర్ట్ చేసే ఉద్దేశ్యంతో ఈ రకంగా చేస్తున్నారు అని ముద్రగడ ఆరోపించారు. అయితే చంద్రబాబు ఆ విధంగా కాకుండా తప్పు జరిగింది పొరపాటు అయింది అని ఉంటే ఎంతో గౌరవంగా హుందాగా ఉండేదని ముద్రగడ అన్నారు.

**బుద్ధా కౌంటర్ :**

అయితే ముద్రగడ పద్మనాభరెడ్డి చేసిన కామెంట్స్ లేఖలోని సారాంశం మీద మాజీ ఎమ్మెల్సీ టీడీపీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న కౌంటర్ ఇచ్చారు. ముద్రగడకు ఇపుడు కాపు కులం గుర్తుకు వచ్చిందా అని అందులో నిలదీశారు. ఆయనకు అవసరం అయినప్పుడే కులం గురించి మాట్లాడమని ఆయన తండ్రి చెప్పారా అని ఎద్దేవా చేశారు. గతంలో చాలా సందర్భాలలో కాపులను వైసీపీ వేధిస్తే అపుడు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.

**పవన్ భార్యను తల్లిని :**

వైసీపీ హయాంలో పవన్ భార్యను తల్లిని అవమానించినపుడు ముద్రగడకు కాపులు ఎందుకు గుర్తుకు రాలేదని బుద్ధా వెంకన్న ప్రశ్నించారు. అంతే కాదు మంత్రి నారాయణ మీద తప్పుడు కేసులు పెట్టించి హైదరాబాద్ నుంచి చిత్తూరు దాకా తీసుకెళ్ళినపుడు ఆయన కాపు సామాజిక వర్గం అనిపించలేదా ముద్రగడ గారూ అని నిలదీశారు. చంద్రబాబు భార్యను అసెంబ్లీ లోపలా బయటా నానా మాటలు అన్నపుడు ఇపుడు పలుకుతున్న చిలక పలుకులు నాడు ఎందుకు గుర్తుకు రాలేదని వెంకన్న అడిగారు.

**వాటిని సమర్థిస్తారా :**

మాజీ మంత్రి అంబటి రాంబాబు వాడిన బూతులను సమర్థిస్తారా అని ప్రశ్నించారు. అలాగే జోగి రమేష్ చంద్రబాబు ఇంటి మీద చేసిన దాడికి మద్దతు ఇస్తున్నారా అని ముద్రగడని నిలదీశారు. 1994 ఎన్నికల్లో ఓటమి చెంది ఇంట్లో కూర్చుంటే 1999లో ఎంపీ టికెట్ ఇచ్చి పార్లమెంట్ కి చంద్రబాబు పంపించినపుడు చంద్రబాబు మంచి వ్యక్తి అని చెప్పింది ముద్రగడే కదా అని ఫ్లాష్ బ్యాక్ గుర్తు చేశారు.

**అసూయతో లేఖలు వద్దు :**

వాస్తవాలు తెలుసుకుని లేఖలు రాయండి, అంతే కానీ అసూయతో రాయవద్దు అని బుద్ధా వెంకన్న కోరారు. చంద్రబాబు కులానికో మతానికో ప్రాంతానికో చెందిన వారు కాదని, ఆయన ప్రపంచ నాయకుడని అన్నారు. బాబు మీద ఎవరు అసూయ చెందినా ఆయన అంతకంతకు పెరుగుతారు అన్నది గుర్తు పెట్టుకోవాలని ముద్రగడకు సూచించారు. మొత్తానికి ముద్రగడ బాబుకు రాసిన లేఖ దానికి కౌంటర్ గా బుద్ధా వెంకన్న రాసిన లేఖ రెండూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## వరల్డ్ కప్ టాప్ స్కోరర్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రెండూ అతడికే: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ఈ మెగా టోర్నీని భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నీ చరిత్రలో తొలిసారి 20 జట్లు ఆడుతుండడంతో భారీ హైప్ చోటు చేసుకుంది . టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్– నెదర్లాండ్ మధ్య జరగుతుంది. వరల్డ్ కప్ కు కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో క్రికెట్ ఫ్యాన్స్ ఈ మెగా టోర్నీ కోసం ఆతృత్తగా ఎదురు చూస్తున్నారు. సొంతగడ్డపై జరగనుండడంతో టీమిండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. టోర్నీకి ముందు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ 2026 టీ20 వరల్డ్ కప్ లో టాప్ స్కోరర్ ఎవరో తన అభిప్రాయాన్ని తెలిపాడు. వరల్డ్ కప్ టాప్ స్కోరర్ గురించి మాట్లాడుతూ పాంటింగ్ ఇలా అన్నాడు.. “అభిషేక్ శర్మ స్టార్ బ్యాటర్. ఎక్స్ పీరియన్స్ లేకపోవడం అతనికి సానుకూల విషయం అని నేను భావిస్తున్నాను. 2026 టీ 20 వరల్డ్ కప్ లో అభిషేక్ టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ కూడ కావొచ్చు. అతని హిట్టింగ్ అద్భుతంగా ఉంటుంది. అభిషేక్ ఆడితే ఇండియాకు వరల్డ్ కప్ గెలవడం పెద్ద కష్టం కాదు. ఒకవేళ అతను విఫలమైతే ఇండియా వరల్డ్ కప్ ఆశలు సంక్లిష్టం అవుతాయి. ఈ వరల్డ్ కప్ కు అభిషేక్ ఇండియాకు చాలా కీలకం. నేను అభిషేక్ శర్మ మొదటి కోచ్ ని. 17 ఏళ్ళ వయసులో ఢిల్లీ జట్టులో ఉన్నప్పుడే చాలా ప్రభావం చూపించాడు. అభిషేక్ పై నాకు భారీ అంచనాలు ఉన్నాయి“. అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు.

**తొలిసారి 20 జట్లతో టీ20 వరల్డ్ కప్:**
ఈ సారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, స్కాట్లాండ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి. ఇండియా, పాకిస్తాన్ , అమెరికా (ఖూూ), నమీబియా, నెదర్లాండ్స్ ఒకే గ్రూపులో ఉన్నాయి. భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

**నెంబర్ వన్ ర్యాంక్ లో అభిషేక్ శర్మ:**
అభిషేక్ శర్మ ప్రస్తుతం టీ20 ఫార్మాట్ లో నెంబర్ వన్ బ్యాటర్ గా ఉన్నాడు.
వరల్డ్ క్రికెట్ లో నెంబర్ వన్ బ్యాటర్ గా కొనసాగుతున్న అభిషేక్ అంచనాలకు తగ్గట్టుగా ఆడుతున్నాడు. ప్రత్యర్థి, వేదిక, బౌలర్ తో సంబంధం లేకుండా తన బ్యాటింగ్ తో బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నాడు. న్యూజిలాండ్ తో జరిగిన తొలి టీ20లో కేవలం 35 బంతుల్లోనే 84 పరుగులు చేసి కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఓవరాల్ గా ఈ సిరీస్ లో 45 యావరేజ్.. 250 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేశాడు.

## ఇలాగైతే కంగారులను కష్టమే: ఆస్ట్రేలియాకు వరుస షాకులు.. వరల్డ్ కప్ నుంచి ముగ్గురు మొనగాళ్లు ఔట్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ ముందు ఆస్ట్రేలియా జట్టుకు ఊహించని షాక్ లు తగులుతున్నాయి. కొన్నేళ్లుగా ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్న ఫాస్ట్ బౌలర్స్ పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజల్ వుడ్ అందుబాటులో ఉండడం లేదు. కొన్ని నెలల క్రితం స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇటీవలే వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. తాజాగా జోష్ హేజల్ వుడ్ వరల్డ్ కప్ లోని గ్రూప్ మ్యాచ్ లకు దూరం కావడంతో కంగారులకు వరల్డ్ కప్ ముందు కోలుకోలేని దెబ్బ తగిలింది. హేజల్ వుడ్ మడమ గాయంతో బాధపడుతున్నాడు. ఈ స్టార్ పేసర్ ప్రస్తుతం సిడ్నీలో పునరావాసం పొందుతున్నాడు. వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా జట్టుతో పాటు జోష్ ఇండియాకు ట్రావెల్ చేయడం లేదు. హేజల్ వుడ్ స్థానంలో సీన్ అబాట్ ను ట్రావెలింగ్ రిజర్వ్ గా ఎంపిక చేశారు. గాయం కారణంగా యాషెస్ సిరీస్ కు దూరమైన ఈ ఆసీస్ పేసర్..పూర్తి ఫిట్ నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. సూపర్ 8 మ్యాచ్ లకు కూడా హేజల్ వుడ్ అందుబాటులో ఉండడం అనుమానంగా మారింది. హేజల్ వుడ్ తో పాటు మరో ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్ కూడా ఫిట్ బేస్ సమస్యలతో బాధపడుతున్నాడు.

**వెన్ను గాయంతో కమ్మిన్స్ ఔట్:**
స్టార్ బౌలర్ పాట్ కమ్మిన్స్ టీ20 వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. వెన్ను గాయం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి కమ్మిన్స్ వైదొలిగినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. అతడి స్థానంలో బెన్ ద్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పు ఈవెంట్‌కు కమ్మిన్స్ దూరం కావడం ఆస్ట్రేలియాకు భారీ ఎదురు దెబ్బనేనని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ టీమ్‌లో ప్రధానంగా రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ మెగా టోర్నీకి దూరం కాగా అతడి స్థానంలో బెన్ ద్వార్షుయిస్‌ను ఎంపిక చేసింది. ఇక, తాత్కాలిక జట్టులో ఉన్న మాట్ షార్ట్‌ను తప్పించి అతని స్థానంలో మాట్ రెన్షాను జట్టులోకి తీసుకుంది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజల్ వుడ్ త్రయం లేకుండా ఆసీస్ పేస్ బౌలింగ్ కొంచెం బలహీనంగా మారింది. ఇటీవలే పాకిస్థాన్ తో జరిగిన మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ను ఆస్ట్రేలియా 0–3 తేడాతో కోల్పోయింది. బ్యాటింగ్ దుర్భేధ్యంగా కనిపిస్తున్నా బౌలింగ్ లో మాత్రం కంగారూల జట్టుకు ఇబ్బందులు తప్పేలా లేదు. స్పిన్నర్ ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్ పై ఆసీస్ భారీ ఆశలు పెట్టుకుంది. జట్టులో ఎక్కువగా ఆల్ రౌండర్లు ఉండడం కలిసొచ్చే విషయం.

## USAతో ఇండియా ‘ఏ‘ వార్మప్ మ్యాచ్.. అందరి దృష్టి అతడిపైనే.. లైవ్ స్ట్రీమింగ్ ఎందులో చూడాలంటే..?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 వార్మప్ మ్యాచ్ లకు రంగం సిద్ధమైంది. సోమవారం (ఫిబ్రవరి 2) నుంచి వార్మప్ మ్యాచ్ లు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా నేడు ఇండియా ఏ (ఫిబ్రవరి 2) యూఎస్‌ఏతో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఇండియా సీనియర్ జట్టు ఆడడం లేదు. చిన్న జట్టు కావడంతో బీసీసీఐ భారత ‘ఏ‘ జట్టును ప్రకటించింది. జియో హాట్‌స్టార్ యాప్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లోవార్మప్ మ్యాచ్ లు ప్రత్యక్ష ప్రసారమవుతాయి. మ్యాచ్ సాయంత్రం 5:00 గంటలకు ప్రారంభమవుతుంది. డీవై పాటిల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఖూూతో నేడు జరగబోయే మ్యాచ్ లో అందరి కళ్ళు టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మపైనే ఉన్నాయి. గత నెలలో విజయ్ హజారే ట్రోఫీ ఆడుతూ తిలక్ గాయపడ్డాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ తో జరిగిన ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కు దూరమయ్యాడు. పూర్తి ఫిట్ నెస్ సాధించిన ఈ హైదరాబాదీ కుర్రాడు వార్మప్ మ్యాచ్ లో రాణించి గాడిలో పడాలని టీమిండియా యాజమాన్యం భావిస్తుంది. తిలక్ వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉండడంతో తనను తాను నిరూపించుకోవడం ఈ యంగ్ ప్లేయర్ కు చాలా కీలకం. తిలక్ తో పాటు రవి బిష్ణోయ్, రియాన్ పరాగ్ కూడా వరల్డ్ కప్ స్క్వాడ్ లో సుందర్ స్థానంలో ఎంపికయ్యే అవకావం ఉంది. దీంతో వీరిద్దరూ రాణించడం తప్పనిసరి. సోమవారం (ఫిబ్రవరి 2) నుంచి ఫిబ్రవరి 6 వరకు వార్మప్ మ్యాచ్ లు జరుగుతాయి. మొత్తం 5 రోజుల పాటు 15 మ్యాచ్ ల షెడ్యూల్ ను ఏర్పాటు చేశారు. మొత్తం మూడు వార్మప్ మ్యాచ్ లు టీమిండియా ఆడాల్సి ఉంది. ఇండియా ఫిబ్రవరి 4 న సౌతాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. ఇండియా వరల్డ్ కప్ లో ఆడబోయే లీగ్ మ్యాచ్ కు మూడు రోజుల ముందు డీవై పాటిల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు జరుగుతుంది. అమెరికా, నమీబియాలతో జరగబోయే వార్మప్ మ్యాచ్ ల కోసం సీనియర్ జట్టు కాకుండా ఇండియా ‘ఏ‘ జట్టు ఆడనుంది. బీసీసీఐ భారత ‘ఏ‘ జట్టును సోమవారం (ఫిబ్రవరి 2) ప్రకటించింది. భారత ఏ జట్టుకు బదోనీ కెప్టెన్సీ చేయనున్నాడు. స్క్వాడ్ లో తిలక్ వర్మను కూడా ఎంపిక చేశారు. మన్ ధీర్, అశుతోష్ శర్మ, ప్రియాంష్ ఆర్య, ఉర్విల్ పటేల్, పరాగ్ జట్టులో సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. ఇటీవల న్యూజిలాండ్ తో జరిగిన టీ20 సిరీస్ లో ఆడిన రవి బిష్ణోయ్ ని ఎంపిక చేశారు. మానవ్ సుతార్, విప్రజ్ నిగమ్ రూపంలో ఇద్దరు స్పిన్–బౌలింగ్ ఆల్ రౌండర్లు ఉన్నారు. గుర్జప్నీత్ సింగ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్, అశోక్ శర్మ లతో పేస్ విభాగాన్ని ఎంపిక చేశారు.

## ట్రెండీ అవుట్ ఫిట్ లో మృణాల్ అందాలు.. ఆ లుక్ చూసారా?



టాలీవుడ్‌లో ‘సీతారామం‘తో ప్రతి ఇంటి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్, ఇప్పుడు తన గ్లామర్ , స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. సంప్రదాయబద్ధమైన పాత్రల్లో ఎంతగా ఒదిగిపోతుందో, మోడ్రన్ బోల్డ్ లుక్స్‌లోనూ అంతే ధైర్యంగా తన బ్యూటీని ఎలివేట్ చేయగలగడం ఆమె ప్రత్యేకత. కేవలం నటనకే పరిమితం కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా మారుతూ యువతలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా తన ప్రతిభతో నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న ఈ భామ, ఫ్యాన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేస్తోంది.



**మోడ్రన్ లుక్‌లో వెలిగిపోతున్న మృణాల్:**
తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ సరికొత్త స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తోంది. ఈ పిక్స్‌లో ఆమె ధరించిన మోడ్రన్ అవుట్‌ఫిట్ ఆమె పర్సనాలిటీకి పర్ఫెక్ట్‌గా సరిపోయింది. కెమెరా కళ్లకు తన చూపులతో మంత్రముగ్ధులను చేస్తూ, ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ ఫోజులు ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్, ఇయర్ రింగ్స్, సింపుల్ మేకప్ మరియు ఆ యాటిట్యూడ్ ఈ ఫోటోలకు ఒక వింటేజ్ క్లాసిక్ టచ్ ఇచ్చాయి. ఆధునికతను, క్లాస్‌ను మిక్స్ చేస్తూ మృణాల్ చేసిన ఈ ఫోటో షూట్ చూస్తుంటే, ఆమె కేవలం నటి మాత్రమే కాదు, ఒక పర్ఫెక్ట్ మోడల్ అని కూడా నిరూపిస్తోంది.

**సినిమా ప్రయాణం:**
కెరీర్ హిట్స్ , క్రేజీ ప్రాజెక్ట్స్ తో మృణాల్ కెరీర్ ప్రస్తుతం గోల్డెన్ ఫేజ్‌లో ఉంది. తెలుగులో ‘సీతారామం‘, ‘హాయ్ నాన్న‘ వంటి క్లాసిక్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న ఈమె, గత ఏడాది తెలుగులో సినిమా లేకపోయినా బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీతో అలరించింది. 2023 లో వచ్చిన హాయ్ నాన్న సినిమా సక్సెస్ తరువాత వరుసగా ఆమె నుండి మూవీస్ వస్తాయి అని అనుకున్నారు. అనుకున్నట్టు గానే విజయదేవరకొండ సరసన 2024లో ఫామిలీ స్టార్ వండి మూవీ లో నటించారు.కానీ సినిమా అంతగా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక తెలుగులో ఆమె సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఆమె రాబోయే చిత్రాల విషయానికి వస్తే, తెలుగులో అడవి శేష తో డెకాయిట్ మూవీలో నటిస్తున్నారు. ఇక బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ప్రభాస్ ‘ఫౌజి‘ (ఖ్రీుబయఱ) సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి, ఇది నిజమైతే టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ ఆకాశాన్ని తాకడం ఖాయం. అలాగే హిందీలో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను చాలా ప్లాన్డ్‌గా ముందుకు తీసుకెళ్తోంది. అందానికి కేవలం రూపమే కాదు, ఆత్మవిశ్వాసం కూడా తోడైతే ఎలా ఉంటుందో మృణాల్ ఠాకూర్‌ను చూస్తే అర్థమవుతుంది. అటు వెండితెరపై నటనతో, ఇటు సోషల్ మీడియాలో తన స్టైల్‌తో మృణాల్ చేస్తున్న హంగామా ఇప్పుడప్పుడే తగ్గేలా లేదు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలతో ఆమె మనల్ని అలరించాలని కోరుకుందాం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com